


Truth of News

RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in

చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | చిత్తూరు | సంచిక : 57 | బుధవారం 23 జూలై 2025 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## మరణ శిక్ష నుంచి తప్పించుకున్న నిమిష..!

**- త్వరలో విడుదల..?**



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం, జూలై 22:

యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు నిమిష ప్రియ త్వరలో విడుదల అవుతుందని క్రైస్తవ మత ప్రచారకుడు డాక్టర్ కె.ఎ. పాల్ ప్రకటించారు. ప్రధాని నరేంద్ర మోదీకి, యెమెన్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. హత్య కేసులో యెమెన్‌లో మరణశిక్ష ఎదుర్కొంటున్న కేరళ నర్సు

- మిగతా 2లో..

## కుసుమ్-బి పథకం కింద 40 వేల పంపుసెట్లకు ఆమోదం

**- త్వరితగతిన అమలు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశం**

బెంగళూరు- సూర్య వాస్తవం, జూలై 22:

సౌర వ్యవసాయ పంపుసెట్ పథకం కుసుమ్-బి కింద 40,000 పంపుసెట్ల ఏర్పాటుకు ఆమోదం లభించింది మరియు దీనిని త్వరగా అమలు చేయడానికి చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య మంగళవారం అధికారులను ఆదేశించారు. కుసుమ్ బి పథకం పురోగతి సమీక్ష సమావేశం నిర్వహించిన ముఖ్యమంత్రి, కుసుమ్-బి పథకం అమలును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారని అధికారులు తెలిపారు.

- మిగతా 2లో..





## 27కి చేరిన మృతుల సంఖ్య..

- మృతుల్లో 25 మంది చిన్నారులే..
- పైలెట్, విమాన లెఫ్టినెంట్ మొహమ్మద్ టోకిర్ ఇస్లాం మృతి
- 170 మందికి గాయాలు
- పలువురి పరిస్థితి విషమం

2లో

- సీఎం చంద్రబాబు ఆదేశాలు
- వ్యవసాయం, అనుబంధ రంగాలపై సమీక్ష
- నాలుగు గంటల పాటు లోతైన చర్చ
- శాటిలైట్ సర్వే ఫలితాలు బాగున్నాయన్న చంద్రబాబు
- ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయి డేటాతో సరిపోల్చాలని సూచన
- 'కోకో ముంజ్'పై ప్రశంసలు

## శాటిలైట్ సర్వే ద్వారా పంట వివరాల సేకరణ

అమరావతి - సూర్య వాస్తవం, జూలై 22:

రాష్ట్రంలో వ్యవసాయ రంగ అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు సమగ్ర చర్యలు చేపట్టారు. మంగళవారం సచివాలయంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై నిర్వహించిన సమీక్షలో ఆయన శాటిలైట్ సర్వే ద్వారా పంటల వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం భలభద్రాపురంలో చేపట్టిన శాటిలైట్ సర్వే ఫలితాలు సమగ్ర సమాచారాన్ని అందించాయని, ఈ సమాచారాన్ని క్షేత్రస్థాయి డేటాతో సరిపోల్చాలని సూచించారు. ఒకే ప్రాంతంలో ఒకే తరహా పంటల సాగుకు రైతులకు మార్గదర్శనం అందించాలని, రైతు సేవా కేంద్రాల ద్వారా నిరంతర సహకారం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ల్యాండ్ రీసర్వే తర్వాత రెవెన్యూ రికార్డుల ప్రక్షాళనతో పాటు వ్యవసాయ రికార్డుల నవీకరణ కూడా చేపట్టాలని స్పష్టం చేశారు.

సమీక్షలో నాలుగు గంటలకు పైగా లోతైన చర్చ జరిగింది. రైతులకు మేలు చేసే సూచనలతో పాటు, జలవనరుల శాఖ అధికారులతో నీటి నిర్వహణపై మార్గదర్శకాలు జారీ చేశారు. అన్ని కాలువల ద్వారా నీటిని చిట్టచివరి ఆయకట్టు వరకు విడుదల చేయాలని, నాగార్జున సాగర్ కుడికాలువ ద్వారా గుంటూరు ప్రాంతానికి సాగునీరు అందించాలని ఆదేశించారు. సాగునీటి

- మిగతా 2లో..





## మళ్లీ ఉభయసభలు వాయిదా

- సభలో ఎస్ఐఆర్, పెహల్గామ్ ఉగ్రదాడి వంటి అంశాలపై చర్చ జరగాలని పట్టుబట్టిన ప్రతిపక్షాలు
- వెల్‌లోకి దూసుకురావడంతో సభ వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా

2లో

## ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

- అనూహ్యంగా తన పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్
- ఆరోగ్యానికి ప్రాధాన్యం ఇవ్వడం, వైద్యుల సలహాను పాటించడం కోసమేనంటూ రాజీనామా లేఖ
- ఆయన రాజీనామాను తాజాగా ఆమోదించిన రాష్ట్రపతి



న్యూఢిల్లీ- సూర్య వాస్తవం, జూలై 22:

ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ము మంగళవారం ఆమోదం తెలిపారు. ఆయన రాజీనామా వెంటనే అమలులోకి వస్తుందని ప్రకటించారు. ఈ మేరకు ధన్ ఖడ్ రాజీనామాను ఆమోదిస్తున్నట్లు సంతకం చేసి లేఖను హోంశాఖకు పంపించారు. కాగా, సోమవారం పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు ప్రారంభం కాగా చైర్మన్ హోదాలో

- మిగతా 2లో..

## మద్యం స్కాం వేల కోట్ల కుంభకోణం...

- ఏ స్థాయి వరకు వెలుతుందో నాకు తెలియదు
- ఓ న్యూస్ చానల్ కు ఇంటర్వ్యూ ఇచ్చిన పవన్ కల్యాణ్
- లిక్కర్ స్కాం కల్పిత కథ కాదని స్పష్టీకరణ
- సాక్ష్యాధారాలున్నాయని వెల్లడి



అమరావతి - సూర్య వాస్తవం, జూలై 22:

ఏపీలో జరిగిన లిక్కర్ స్కాం సాధారణమైనది కాదని, వేల కోట్ల కుంభకోణం జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. ఈ వ్యవహారం ఏ స్థాయి వరకు వెళుతుందో తనకు తెలియదని అన్నారు. ఈ కేసులో జగన్ అరెస్ట్ పై కేంద్రం అనుమతి కావాలా? అనే విషయంపై తాను ఇప్పుడే ఏమీ చెప్పలేనని తెలిపారు. ఓ తెలుగు న్యూస్ ఛానల్ కు ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పవన్ ఈ వ్యాఖ్యలు చేశారు. లిక్కర్ స్కాం అనేది కల్పిత కథ కాదని, మద్య నిషేధం చేస్తామని చెప్పి వేల కోట్ల వ్యాపారం చేశారని ఆరోపించారు. ఇష్టం వచ్చిన కంపెనీలకు అనుమతులు

- మిగతా 2లో..



## బీహార్ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇండియా బ్లాక్ నిరసన

- మకర్ ద్వార్ ఎదుట లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పలువురు ఎంపీల నిరసన

2లో

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం

**- ఆనం రామనారాయణరెడ్డి**



2లో

## రాయలసీమను సస్య శ్యామలం చేసే దిశగా సీఎం ప్రత్యేక శ్రద్ధ

- నాలుగు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే విధంగా హెచ్ఎన్ఎస్ఎస్
- జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో రాయలసీమ బిడ్డని అని చెప్పుకొని సీమ కే అన్యాయం చేశారు
- కూటమి ప్రభుత్వం ఏడాది లోనే హంద్రీనీవా ఫేజ్1, ఫేజ్ 2 కి రూ.3873 కోట్లు ఖర్చు
- రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి

6లో

## ఆ పథకం అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్మేయాలి..

- మంత్రి అచ్చెన్న వివాదాస్పద వ్యాఖ్యలు!

2లో



# 27కి చేరిన మృతుల సంఖ్య..

**- మృతుల్లో 25 మంది చిన్నారులే.. - పైలెట్, విమాన లెఫ్టినెంట్ మొహమ్మద్ టోకిర్ ఇస్లాం మృతి**

**- 170 మందికి గాయాలు - పలువురి పరిస్థితి విషమం**

**ఢాకా – సూర్య వాస్తవం, జూలై 22:**

బంగ్లాదేశ్‌లో పాఠశాల భవనంపై కూలిన శిక్షణ విమానం ఘటనలో మృతుల సంఖ్య 27కి చేరింది. 27 మంది మృతుల్లో 25 మంది చిన్నారులే ఉన్నట్లు బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వ ప్రత్యేక ప్రతినిధి సైదుర్ రెహమాన్ మీడియా సమావేశంలో వెల్లడించారు. 170 మంది దాకా గాయపడ్డారని, వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిపారు. మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అన్నారు. మృతులకు నివాళిగా మంగళవారం సంతాపదినంగా ప్రకటించినట్లు తెలిపారు. ఈ ఘటనపై విచారణ కోసం ఉన్నత స్థాయి కమిటీని నియమించామని అన్నారు.

ఢాకాలో సోమవారం మధ్యాహ్నం బంగ్లాదేశ్ వైమానిక దళానికి చెందిన శిక్షణ విమానం టేకాఫ్ అయిన కొన్ని నిమిషాలకే ఒక పాఠశాల భవనంపై కూలిపోయిన సంగతి తెలిసిందే. ప్రమాదం జరిగిన వెంటనే 20 మంది మరణించగా, రాత్రి సమయంలో గాయాలతో మరో ఏడుగురు మరణించారు. ఈ ప్రమాదంలో పైలెట్, విమాన లెఫ్టినెంట్ మొహమ్మద్ టోకిర్ ఇస్లాం కూడా మరణించారు.

# మళ్లీ ఉభయసభలు వాయిదా

**- సభలో ఎస్ఐఆర్, పెహల్గామ్ ఉగ్రదాడి వంటి అంశాలపై చర్చ జరగాలని పట్టుబట్టిన ప్రతిపక్షాలు**

**- వెల్‌లోకి దూసుకురావడంతో సభ వాయిదా వేసిన స్పీకర్ ఓంబిర్లా**

**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 22:** మరోసారి పార్లమెంట్ ఉభయ సభలు వాయిదాపడ్డాయి. సభలో ఎస్ఐఆర్, పెహల్గామ్ ఉగ్రదాడి వంటి అంశాలపై చర్చ జరగాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. ప్రతిపక్ష ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని సభలోని వెల్‌లో దూసుకురావడంతో.. స్పీకర్ ఓంబిర్లా వ్యతిరేకించారు. ఈ అంశాలపై క్వశ్చన్ అవర్‌లో చర్చిద్దామని స్పీకర్, కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ ప్రతిపక్ష ఎంపీలకు విజ్ఞప్తి చేశారు. అయినాసరే ప్రతిపక్ష ఎంపీలు వారి మాటను వినకుండా చర్చకు పట్టుబట్టడంతో.. స్పీకర్ ఓంబిర్లా సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.

మంగళవారం సభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్ సభా కార్యకలాపాలు నిర్వహించారు. మంగళవారం రాజ్యసభ కూడా ప్రతిపక్ష ఎంపీల నిరసనల మధ్య మధ్యాహ్నానికి వాయిదా పడింది. రాబోయే అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్‌లో ఇసి నిర్వహిస్తున్న ఎస్ఐఆర్‌పై చర్చించడానికి ప్రతిపక్ష ఎంపీలు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చారు. ఎస్ఐఆర్‌పై చర్చించాలని ప్రతిపక్షాలు పట్టుబట్టాయి. దీంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు.

# మరణ శిక్ష నుంచి తప్పించుకున్న నిమిష..!

(మొదటి పేజీ తరువాయి)

నిమిష ప్రియ శిక్ష రద్దు చేశారు. ఈ విషయాన్ని క్రైస్తవ మత ప్రచారకుడు, గ్లోబల్ పీస్ ఇనిషియేటివ్ వ్యవస్థాపకుడు డాక్టర్ కె.ఎ. పాల్ ప్రకటించారు. యెమెన్ రాజధాని సనా నుంచి ఒక వీడియో సందేశం విడుదల చేశారు. నిమిష త్వరలో భారతదేశానికి తిరిగి వస్తారని అన్నారు. భారత ప్రభుత్వ అధికారులు, యెమెన్ నాయకులతో వరుసగా పది రోజులు పగలు, రాత్రి చర్చించి ఈ గొప్ప విజయాన్ని సాధించానని వెల్లడించారు. ఇందుకు సహకరించిన ప్రధాని నరేంద్ర మోదీకి, యెమెన్ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

**యెమెన్‌కు ధన్యవాదాలు: కేఏ పాల్**

కేఏ పాల్ నిమిష ప్రియ విడుదలపై తన ఎక్స్ ఖాతాలో ఓ వీడియో పోస్ట్ చేశారు. అందరి ప్రార్థనలు, గత 10 రోజులుగా చేస్తున్న కృషి ఫలించి నిమిష ప్రియకు విధించిన మరణశిక్ష రద్దయిందని ప్రకటించారు. ఈ విజయానికి కారకులైన యెమెన్ నాయకులకు, ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. దేవుని దయవల్ల యెమెన్ రాజధాని సనా జైలు నుంచి నిమిష విడుదలై త్వరలో భారతదేశానికి రాబోతోందని వెల్లడించారు. నిమిషను సురక్షితంగా ఇంటికి తీసుకెళ్లడానికి భారత ప్రభుత్వం దౌత్యవేత్తలను పంపించేందుకు అంగీకరించిందని తెలిపారు. ఆమెను సనా జైలు నుంచి స్వదేశానికి తెచ్చేందుకు భారత ప్రభుత్వం లాజిస్టిక్స్ ఏర్పాట్లు చేసుకోవచ్చని అన్నారు. కాగా, జులై 16న నిమిషకు విధించాల్సిన ఉరిశిక్ష వాయిదా పడిన సంగతి తెలిసిందే. కేరళ గ్రాండ్ ముఫ్తీ షేక్ అబుబకర్ అహ్మద్ అప్పటి నుంచి విదేశాంగ మంత్రిత్వ శాఖ యెమెన్‌లోని స్థానిక అధికారులతో నిరంతర చర్చలు జరుపుతోంది. సనాలో జైలు శిక్ష అనుభవిస్తున్న నిమిష ప్రియకు సాధ్యమైనంత సహాయం అందిస్తున్నట్లు వెల్లడించింది. ఈ సున్నిత విషయంలో ప్రియ కుటుంబానికి చట్టపరమైన సహాయం చేయడానికి ఎంఈఏ ఒక న్యాయవాదిని నియమించిందని ప్రభుత్వ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ తెలియజేశారు. షరియా చట్టం ప్రకారం క్షమాభిక్ష లేదా క్షమాపణ కోసం చేసే ప్రయత్నాలకు సహకరిస్తుందని అన్నారు.

# 40 వేల పంపుసెట్లకు ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

ఈ సమావేశంలో ఇంధన శాఖ మంత్రి కె.జె. జార్జ్ మరియు ఆ శాఖ సీనియర్ అధికారులు పాల్గొన్నారు. కుసుమ్–బి అనేది ప్రధాన మంత్రి కిసాన్ ఉర్జా సురక్ష అవమ్ ఉత్థాన మహాభియాన్ పథకంలో బి భాగం, ఇది నీటిపారుదల కోసం 14 లక్షల స్టాండ్–అలోన్ సోలార్ వ్యవసాయ పంపు సెట్ల సంస్థాపనపై దృష్టి పెడుతుంది. ఈ పథకం కింద, సౌర వ్యవసాయ పంపుసెట్ల ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం 30 శాతం మరియు రాష్ట్ర ప్రభుత్వం 50 శాతం సబ్సిడీని అందిస్తుండగా, లబ్ధిదారులు 20 శాతం భరించాలి. ఈ సమావేశంలో, 40,000 పంపుసెట్ల ఏర్పాటుకు ఆమోదం లభించిందని ముఖ్యమంత్రి గుర్తించి, వాటి అమలుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారని అధికారిక ప్రకటన తెలిపింది..ఈ పథకం కింద అదనంగా 25,000 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారు మరియు రాష్ట్ర ప్రభుత్వం దీని కోసం రూ.752 కోట్లు ఖర్చు చేస్తుంది. పథకం సరిగ్గా అమలు చేయబడిన తర్వాత సబ్సిడీ మొత్తం తగ్గించబడుతుంది. 4.5 లక్షల అనధికార ఐపీ సెట్లలో, 2 లక్షల ఐపీ సెట్ కనెక్షన్లకు అధికారం ఇవ్వబడింది. ఈ అనధికార ఐపీ సెట్‌లను కుసుమ్ బి పథకం కిందకు ప్రాధాన్యత ఇవ్వడంపై సమావేశంలో చర్చించారు. రైతులు తమ సొంత విద్యుత్ మౌలిక సదుపాయాలను సృష్టించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు మరియు ఆ శాఖ ట్రాన్స్‌ఫార్మర్లను అందిస్తుందని ప్రకటనలో పేర్కొంది. 2024–25 సంవత్సరంలో నీటిపారుదల పంపు సెట్ల కోసం రూ.12,785 కోట్లు గ్రాంట్ కేటాయించారు, అందులో రూ.11,720 కోట్లు ఫిబ్రవరి 2025 వరకు విడుదల చేశారు. 2025–26 సంవత్సరానికి రూ.16,021 కోట్ల బడ్జెట్ కేటాయింపు జరిగింది.

## శాటిలైట్ సర్వే ద్వారా

# పంట వివరాల సేకరణ

(మొదటి పేజీ తరువాయి)

సంఘాలతో త్వరలో వర్చువల్ సమావేశాలు నిర్వహించి నేరుగా సంప్రదింపులు జరిపేందుకు సీఎం సిద్ధమయ్యారు.

**ఏఐ చాట్ బోట్‌తో రైతులకు సహకారం:** పంటల ప్రణాళిక, విలువ జోడింపు, సాంకేతిక సహకారం కోసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ చాట్ బోట్‌ను వినియోగించాలని సీఎం సూచించారు. 47.41 లక్షల మంది రైతుల ఈకేవైసీ 'అన్నదాత సుఖీభవ' పథకం కింద పూర్తయిందని అధికారులు తెలిపారు. ఇ–పంట ద్వారా అర్హులను గుర్తించి, ప్రతి రైతుకు ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ప్రకృతి సేద్యం, ఆర్గానిక్ సర్టిఫికేషన్‌పై దృష్టి:** ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం వల్ల భూసారం తగ్గుతోందని, రైతులకు సరైన మార్గదర్శనం ద్వారా వీటిని నియంత్రించాలని సీఎం సూచించారు. ప్రకృతి సేద్యం, ఆర్గానిక్ ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించాలని, ఆర్గానిక్ ఉత్పత్తులకు సర్టిఫికేషన్ ఇవ్వడం ద్వారా జపాన్, తైవాన్ వంటి దేశాలకు ఎగుమతులు సాధ్యమవుతాయని తెలిపారు. టాటాతో ఒప్పందం ద్వారా ఈ ప్రక్రియను వేగవంతం చేయనున్నారు. ఇంటిగ్రేటెడ్ పెస్ట్ మేనేజ్మెంట్, డ్రోన్ల వినియోగం ద్వారా పురుగుమందుల వాడకాన్ని తగ్గించాలని సూచించారు.

**మొబైల్ రైతు బజార్లు, సూక్ష్మ సేద్యం:** నగరాల్లో అపార్ట్‌మెంట్ల వద్ద మొబైల్ రైతు బజార్ల ఏర్పాటుతో ఉత్పత్తులను నేరుగా విక్రయించేలా చర్యలు తీసుకోవాలని, 30 రోజుల్లో కార్యాచరణ రూపొందించాలని సీఎం ఆదేశించారు. సూక్ష్మ సేద్యం ద్వారా ఉద్యాన పంటల సాగును విస్తరించాలని, రాయలసీమలో కాలువలతో పాటు మైక్రో ఇరిగేషన్‌ను ప్రోత్సహించాలని సూచించారు.

**మత్స్య, పశుసంపద రంగాలకు ప్రాధాన్యత:** మత్స్యకారులకు సముద్ర మత్స్య సంపద వివరాలను యాప్ ద్వారా అందించాలని, సీవీడ్ సాగును ప్రోత్సహించాలని సీఎం సూచించారు. ఆక్వా ఉత్పత్తుల నాణ్యతపై రాజీ లేకుండా, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించే రైతులకు సబ్సిడీలు అందించాలని ఆదేశించారు. పశుసంపద రంగంలో 15 శాతం వృద్ధిని లక్ష్యంగా నిర్దేశించారు.

**'కోకో ముంజ్'పై ముఖ్యమంత్రి ప్రశంసలు:** కొబ్బరితో తయారు చేస్తున్న 'కోకో ముంజ్' సంస్థ ఉత్పత్తులను పరిశీలించిన ముఖ్యమంత్రి... సంస్థ ప్రతినిధిని అభినందించారు. ఈ సమీక్షకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, వ్యవసాయం–అనుబంధ రంగాలకు చెందిన ఉన్నతాధికారులు హాజరయ్యారు.

# బీహార్ ఎస్ఐఆర్‌ను వ్యతిరేకిస్తూ ఇండియా బ్లాక్ నిరసన

**- మకర్ ద్వార్ ఎదుట లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పలువురు ఎంపీల నిరసన**



**న్యూఢిల్లీ – సూర్య వాస్తవం, జూలై 22:** బీహార్‌లో కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్)ను వ్యతిరేకిస్తూ పార్లమెంట్ వేదికగా ఇండియా బ్లాక్ నిరసన చేపట్టింది. మకర్ ద్వార్ ఎదుట లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ, ఎస్ ఎంపి అఖిలేష్ యాదవ్, ఆర్‌జెడి ఎంపి మీసా భారతి, డిఎంకె ఎంపి కనిమొళి సహా పలువురు ఇండియా బ్లాక్ ఎంపిలు ప్లకార్డులతో నిరసన తెలిపారు. మంగళవారం లోక్‌సభ కార్యకలాపాలు ప్రారంభమైన రెండు నిమిషాలకే సభ మధ్యాహ్నానికి వాయిదా పడిన సంగతి తెలిసిందే. బీహార్‌లోని ఎస్ఐఆర్‌కి సంబంధించి ప్రతిపక్ష సభ్యులు పలు అంశాలను లేవనెత్తేందుకు యత్నించారు. కాంగ్రెస్ ఎంపి మాణికం ఠాగూర్ ఎస్ఐఆర్‌పై నోటీసు ఇచ్చారు. కానీ సభ రెండు నిమిషాల్లోనే వాయిదా పడింది. నిబంధన 267 కింద ప్రతిపక్ష సభ్యులు 12 వాయిదా నోటీసులు ఇచ్చారు. జాబితా చేయబడిన అంశంపై చర్చించడానికి మంగళవారం సభా కార్యకలాపాలను నిలిపివేయాలని కోరింది. అయితే డిప్యూటీ చైర్మన్ హరివంశ్ ఈ వాయిదా నోటీసులను తిరస్కరించారు. లోక్‌సభలో గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాల్లో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2024ను చర్చించనున్నారు. సముద్ర మార్గం ద్వారా వస్తువుల రవాణా బిల్లు, 2025ని రాజ్యసభలో ప్రవేశపెట్టనున్నారు.

# ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ఆమోదం

(మొదటి పేజీ తరువాయి)

జగదీప్ ధన్ ఖడ్ రాజ్యసభ కార్యక్రమాలను సజావుగా నిర్వహించారు.

తొలిరోజు కార్యకలాపాలు ముగిసి సభ మంగళవారానికి వాయిదా పడిన తర్వాత ధన్ ఖడ్ తన రాజీనామా నిర్ణయాన్ని ప్రకటించారు. అనారోగ్య కారణాల వల్ల ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేస్తున్నట్లు చెప్పారు. ఈ మేరకు రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు ఆయన రాజీనామా లేఖను సమర్పించారు. తన రాజీనామాను వెంటనే ఆమోదించాలని రాష్ట్రపతిని కోరారు. కాగా, ఉపరాష్ట్రపతితో పాటు పలు పదవులు నిర్వర్తించిన జగదీప్ ధన్ ఖడ్ దేశానికి ఎంతో సేవలందించారని ప్రధాని నరేంద్ర మోదీ కొనియాడారు. ధన్ ఖడ్ రాజీనామాకు రాష్ట్రపతి ముర్ము ఆమోదం తెలిపిన తర్వాత ప్రధాని మోదీ ఈ మేరకు ట్వీట్ చేశారు.

# మద్యం స్కాం వేల కోట్ల కుంభకోణం...

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చారని, పైగా కల్తీ మద్యం అమ్మారని మండిపడ్డారు. ఎంతోమంది చనిపోయారు, ఎంతోమంది నరాల జబ్బులతో బాధపడుతున్నారు... ఇవన్నీ కూడా లిక్కర్ స్కాంకు సాక్ష్యాధారాలే అని పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. వైసీపీ నేతలు రప్పా రప్పా నరికేస్తాం, చంపేస్తాం అంటున్నారని... మధ్యయుగం నాటి మాటలు ఇప్పుడు మాట్లాడితే శిక్ష తప్పదని హెచ్చరించారు. అయినా, జగన్ మళ్లీ గెలిస్తే ఏం చేస్తాడని పవన్ ప్రశ్నించారు.

# సూపర్ సిక్స్ పథకాలను అమలు చేస్తాం

**- ఆనం రామనారాయణరెడ్డి**

**నంద్యాల – సూర్య వాస్తవం, జూలై 22:**



సూపర్ సిక్స్ పథకాలను నూటికి నూరు శాతం అమలు చేసి తీరుతామని దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరితారెడ్డి అన్నారు. మంగళవారం నాడు సుపరిపాలన తొలి అడుగు కార్యక్రమంలో గడివేముల మండలంలోని దుర్వేసి గ్రామంలో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామ నారాయణరెడ్డి, పాణ్యం ఎమ్మెల్యే గౌరీ చరిత రెడ్డి లు పాల్గొని గ్రామంలోని ఇంటింటికి తిరిగి కూటమి ప్రభుత్వం చేపట్టిన సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు వివరించి వారి సమస్యలు ఏమన్నా ఉంటే అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆనం మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సంవత్సర కాలం పూర్తయిన సందర్భంగా సుపరిపాలన తొలి అడుగులో దాదాపుగా సూపర్ సిక్స్ పథకాలన్నిటిని పూర్తి చేశామని రాబోవు రోజుల్లో మిగిలిన వాటిని పూర్తి చేస్తామని ఆయన అన్నారు. అలాగే దుర్వేసి గ్రామంలో సుంకులమ్మ గుడి కావాలని గ్రామ ప్రజలు కోరారని వారి కోరిక మేరకు త్వరలో అధికారులతో మాట్లాడి స్థలం కేటాయించి గుడికి నిధులు మంజూరు చేస్తామని ఆయన హామీ ఇచ్చారు. అలాగే పాణ్యం నియోజకవర్గంలో కాల్వబుగ్గ దేవస్థానానికి నాలుగు కోట్లు మంజూరు చేశామని ప్రస్తుతం పనులు జరుగుతున్నాయని ఆయన అన్నారు. అలాగే నియోజకవర్గంలోని మరిన్ని గుళ్ళు మంజూరు చేసి పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుందని ఆయన అన్నారు. ఇప్పటివరకు సంవత్సర కాలంలోనే పాణ్యం నియోజకవర్గంలో ఎన్నో సీసీ రోడ్లు వేశామని త్వరలో గోరుకల్లు అలగనూరు రిజర్వాయర్లకు నిధులు మంజూరు చేసి వాటిని కూడా పూర్తి చేస్తామని వారన్నారు. కాబట్టి ప్రతి ఒక్కరికి తెలియపరచడం ఏమనగా కూటమి ప్రభుత్వాన్ని ఆశీర్వదించాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో నందికొట్కూరు టిడిపి ఇంచార్జ్ గౌరు వెంకటరెడ్డి, నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జై సూర్య పాణ్యం మార్కెట్ యార్డ్ చైర్మన్ అంగజాల గీత, మాజీ ఎంపీపీ శ్రీనివాస్ రెడ్డి, మండల టిడిపి కన్వీనర్ దేశం సత్యనారాయణరెడ్డి అంటా రామచంద్రారెడ్డి, పంట దిలీప్ కుమార్ రెడ్డి, ఒడ్డు లక్ష్మీదేవమ్మ, బొల్లవరం సుభద్రమ్మ, బోధనం భాస్కర్ ఎన్ఎండి రఫీ మాజీ జెడ్పిటిసి సీతారాం రెడ్డి, మండలంలోని టిడిపి నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# ఆ పథకం అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్మేయాలి..

**- మంత్రి అచ్చెన్న వివాదాస్పద వ్యాఖ్యలు!**

**విజయనగరం – సూర్య వాస్తవం, జూలై 22:** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా.. సూపర్ సిక్స్ సహా మ్యానిఫెస్టోలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని ప్రతిపక్షాలు ఆరోపిస్తున్నాయి. ఈ తరుణంలో వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. తమ పార్టీ ఎన్నికల ముందు ప్రకటించిన సూపర్ సిక్స్ పథకాలలో ఓ పథకంను అమలు చేయాలంటే ఆంధ్రానే అమ్మేయాలి అని అన్నారు. మంత్రి వ్యాఖ్యలపై ప్రస్తుతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మంగళవారం కొత్తవలస మంగళపాలెంలో టీడీపీ సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో మంత్రి అచ్చెన్నాయుడు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'సూపర్ సిక్స్ అన్నీ ఇచ్చేశాం. కేవలం మహిళలకు రూ.1500 రూపాయలు ఒక్కటే ఇవ్వాల్సి ఉంది. ఈ పథకం ఇవ్వాలంటే ఆంధ్రప్రదేశ్‌ను అమ్మాల్సిందే. అందుకు ఆలోచిస్తున్నాం. రాష్ట్ర ఆధాయం కేవలం ఉద్యోగుల జీతాలు, పెన్షన్లకే రావడం లేదు. ఈ నెల నుంచి మహిళలకు ఉచిత బస్సు ఇవ్వాలని ప్రభుత్వం చూస్తోంది. కానీ జిల్లాకే పరిమితం చేస్తామన్నారు. నారా లోకేష్ తో మాట్లాడాను. రాష్ట్ర వ్యాప్తంగా ఇవ్వాలని లోకేష్ బాబు చెప్పారు. ఆరు బస్సులలో రాష్ట్రమంతా ప్రయాణించొచ్చు. ఆటో డ్రైవర్‌లు వచ్చి తమకు సాయం చేయాలని కోరారు. వాళ్లనీ మేం ఆదుకుంటాము' అని మంత్రి అచ్చెన్నాయుడు పేర్కొన్నారు.

# సంపాదకీయం

## అమెరికాకు గర్వభంగం



**మూ**డేళ్ల క్రితం ఉక్రెయిన్‌తో యుద్ధం ప్రారంభించిన రష్యా.. ఆ దేశంతో కయ్యం పెంచుకుంటూ పోతూందే తప్ప ఎక్కడా వెనక్కి తగ్గడం లేదు. ఈ సందర్భంలో ప్రపంచ దేశాల మధ్య అన్ని యుద్ధాలను తానే ఆపాననే భ్రమలో ఉన్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. రష్యా, ఉక్రెయిన్ మధ్య యుద్ధాన్నీ ఆపుతానని బీరాలు పలికారు. నార్త్ అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో) సదస్సు సందర్భంగా ఉక్రెయిన్‌తో యుద్ధాన్ని ఆపాలని రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌ను ఫోన్‌లైన్‌లో కోరారు. కానీ, రష్యా అధ్యక్షుడు ఎక్కడా ట్రంప్ మాట పట్టించుకున్నట్టు కనిపించలేదు. దీంతో చిర్రెత్తుకొచ్చిన ట్రంప్ రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై 500 శాతం సుంకాలు విధిస్తానని హెచ్చరికలకు దిగారు. ఉక్రెయిన్‌తో యుద్ధం ఆపకుంటే పరిణామాలు తీవ్రంగా ఉంటాయని కూడా పేర్కొన్నారు. ఈ హెచ్చరికలు పరోక్షంగా భారత్‌ను కూడా తాకాయి. ఇక్కడ విచిత్రమేమిటంటే.. ఎలాంటి అంతర్జాతీయ అధికారిక అర్హతలు లేని నాటో సెక్రటరీ జనరల్ మార్క్ రుట్టే రష్యాతో వ్యాపారం చేసే దేశాలపై సుంకాలు విధిస్తామని బెదిరింపులకు పాల్పడటం చర్చనీయాంశమైంది.

నాటో హెచ్చరికలపై భారత్ కూడా దీటుగానే స్పందించింది. భారత ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ప్రజాప్రయోజన కోణంలోనే ఉంటాయని, సుస్థిరమైన ఇంధన భద్రతకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యమిస్తోందని తాజాగా భారత విదేశాంగ ప్రతినిధి రణ్‌ధీర్ జైస్వాల్ స్పష్టం చేశారు. మార్కెట్‌లో తక్కువ ధరకు చమురు లభించే దేశంలో కొనుగోలు చేయడం సర్వసాధారణమని, యుద్ధంతో వాణిజ్య అంశాన్ని ముడిపెట్టడం తగదని సూచించారు. వాణిజ్య సమస్యలను పరిష్కరించే అధికారం కేవలం వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూటీవో)కు మాత్రమే ఉందని, ఉత్తర అట్లాంటిక్ ఖండంలోని కొన్ని దేశాల సైనిక కూటమి నాటోకు వాణిజ్య ఒప్పందాల్లో ఎలాంటి ప్రమేయం, హక్కులు ఉండవని తేల్చి చెప్పారు. వేల సంవత్సరాల చరిత్రలో ఏ దేశం మీదా దండయాత్రకు దిగని దేశంగా భారత్‌కు గుర్తింపు వుంది. భారత్ ఎప్పుడూ శాంతిపూర్వక వాతావరణంలోనే సమస్యలను పరిష్కరించుకునేందుకు ఆసక్తి చూపుతుంది. అది వాస్తవం. భారత ప్రధాని మోదీ గతేడాది ఆగస్టులో నాటి అమెరికా అధ్యక్షుడు బైడన్‌తో ఫోన్‌లో సంభాషిస్తూ రష్యా, ఉక్రెయిన్ మధ్య శాంతినెలకొనేలా చొరవ తీసుకోవాలని కోరారు.

ఉక్రెయిన్ రష్యా యుద్ధం విషయంలో నాటో వంటి సైనిక కూటమి నుంచి శాంతి సూచనలు వినాల్సిన అవసరం లేదని భారత విదేశాంగశాఖ పరోక్షంగా హెచ్చరికలు జారీ చేసింది. పునః వినియోగ ఇంధన వనరులతో ఇంధన రంగంలో స్వయం సమృద్ధి ఆత్మనిర్భర్ దిశగా వెళ్తున్న భారత్, రష్యా, అమెరికా మొదలు పశ్చిమాసియా, ఆఫ్రికా దాకా వేర్వేరు ఖండాల్లోని దేశాల నుంచి ముడిచమురు, సహజ వాయువులను దిగుమతి చేసుకుంటోంది.భారత ఇంధన భద్రత విషయంలో వేలుపెట్టే అధికారం ఏ దేశానికీ లేదు. అలాంటప్పుడు నాటోకు ఆ అధికారం ఎక్కడిదని పలుదేశాలు విస్మయం వ్యక్తం చేస్తున్నాయి. ఒకవేళ భారత్ నాటో హెచ్చరికలను సీరియస్‌గా తీసుకుంటే, నాటో సభ్య దేశాలతో, ముఖ్యంగా అమెరికా దౌత్య బంధానికి స్వల్ప బీటలు పడే అవకాశముంది.చైనా, భారత్ సారథ్యంలో పటిష్టమవుతున్న 'బ్రిక్స్' కూటమి ఇప్పుడు అంతర్జాతీయ మారకమైన డాలర్ ఆధిపత్యానికి గండికొట్టి ప్రత్యామ్నాయ కరెన్సీని ముందుకు తీసుకొస్తుందనే భయం అమెరికాను వెంటాడుతున్నది. అందుకే అమెరికా కనుసన్నల్లో ఉండే నాటో లాంటి సైనిక కూటమితో పరోక్ష హెచ్చరికలు చేస్తోందని సంకేతాలున్నాయి.యుద్ధానికి వాణిజ్యంతో ముడిపెట్టడం సరికాదని, అంతర్జాతీయ వాణిజ్య విభేదాలను పరిష్కరించేందుకు వరల్డ్ ట్రేడ్ ఆర్గనైజేషన్(డబ్ల్యూటీవో) ఉండనే ఉంది. మరి డబ్ల్యూటీవో విధుల్లోకి నాటో ఎందుకు తలదూర్చుతోందన్న విమర్శలు అన్ని వైపుల నుంచి మొదలయ్యాయి. అమెరికా స్వప్రయోజనాలు కాపాడే డమ్మీ వాణిజ్య విభాగం స్థాయికి నాటో పడిపోయిందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.క్స్ దేశాలపై అదనపు సుంకాలు విధిస్తామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన హెచ్చరికలపై బ్రెజిల్ అధ్యక్షుడు లూయిజ్ ఇనాసియో లూలా డా సిల్వా తీవ్రంగా స్పందించారు. ప్రపంచానికి ఒక చక్రవర్తి అవసరం లేదని, పరిస్థితులు పూర్తిగా మారిపోయాయని ఆయన స్పష్టం చేశారు. రియో డి జెనీరోలో సోమవారం ముగిసిన బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు అనంతరం లూలా మీడియాతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ప్రపంచ ఆర్థిక వ్యవస్థను కొత్త పద్ధతిలో తీర్చిదిద్దేందుకు బ్రిక్స్ దేశాలు ప్రయత్నిస్తున్నాయని, అందుకే కొందరికి ఇది ఇబ్బందికరంగా మారిందని ఆయన అన్నారు.అంతర్జాతీయ వాణిజ్య సంబంధాలు పూర్తిగా డాలర్‌పై ఆధారపడకుండా ప్రత్యామ్నాయ మార్గాలు కనుగొనాల్సిన అవసరం ఉందని లూలా నొక్కిచెప్పారు.


ఇది క్రమంగా జరగాల్సిన ప్రక్రియ అని, ఇందుకోసం సభ్య దేశాల సెంట్రల్ బ్యాంకులు కలిసి పనిచేయాలని సూచించారు. డాలర్ ఆధిపత్యాన్ని సవాల్ చేస్తే బ్రిక్స్ దేశాలపై 100శాతం టారిఫ్‌లు తప్పవని ట్రంప్ గతంలోనే హెచ్చరించారు. తాజాగా ఆయన 14 దేశాలపై అధిక సుంకాలను విధించి వాణిజ్య యుద్ధానికి తెరలేపారు. అయితే, బ్రిక్స్ దేశాలపై వెంటనే సుంకాలు విధించే ఆలోచన లేదని, కానీ అమెరికా వ్యతిరేక చర్యలకు పాల్పడితే మాత్రం కఠినంగా వ్యవహరిస్తామని యూఎస్ వర్గాలు తెలిపినట్లు రాయిటర్స్ పేర్కొంది. మరోవైపు, ట్రంప్ హెచ్చరికలపై ఇతర బ్రిక్స్ దేశాలైన చైనా, రష్యా, దక్షిణాఫ్రికా ఆచితూచి స్పందించాయి. తాము ఏ దేశానికి వ్యతిరేకం కాదని, బలవంతపు చర్యల కోసం సుంకాలను ఆయుధంగా వాడొద్దని చైనా హితవు పలికింది. ఈ విషయంపై భారత్ ఇంకా అధికారికంగా స్పందించలేదు.ఉక్రెయిన్‌కు అమెరికా అన్ని విధాలా అండగా నిలుస్తూ రష్యాకు తీవ్ర హెచ్చరికలు చేసింది. 50 రోజుల్లోగా యుద్ధాన్ని ముగించాలని హెచ్చరించింది. లేకుంటే తీవ్రస్థాయిలో సుంకాలు విధిస్తామని తేల్చిచెప్పింది. రష్యాతో వ్యాపారం చేయొద్దంటూ ఇప్పటికే ప్రపంచ దేశాలకు అమెరికా హెచ్చరికలు చేసింది. దీనిని రష్యా తీవ్రంగా పరిగణించింది. అమెరికాకు తలొగ్గం? బెదిరింపులకు భయపడమంటూ రష్యా తేల్చిచెప్పింది. సుంకాల పేరిట బెదిరించడం ఆమోదయోగ్యం కాదని పేర్కొంది. రష్యా విదేశాంగ శాఖ సహాయ మంత్రి సెర్గీ ర్యాబ్కావ్ స్పందిస్తూ ఉక్రెయిన్‌తో యుద్ధం విషయంలో దౌత్య పరిష్కారాన్ని రష్యా కోరుతోందని, ఇందుకోసం సంప్రదింపులకు సిద్ధంగా ఉందని అన్నారు. తమ ప్రతిపాదనకు తగిన స్పందన లభించకపోయినా, దౌత్యపద్ధతుల్లో అనుకున్న లక్ష్యాలను చేరుకోలేకపోయినా ప్రత్యేక సైనిక చర్యలు కొనసాగుతాయని సెర్గీ వెల్లడిరచారు. మాస్కో స్థానాన్ని ఎవరూ కదల్చలేరని చెప్పారు. తమ మాటలను తేలికగా తీసుకోవద్దని వాషింగ్టన్‌కు, నాటోకు స్పష్టంచేశారు. అదే విధంగా ఉక్రెయిన్‌కు అమెరికా ఆయుధ సాయాన్ని ఖండిరచారు. నాటో దేశాలు శాంతికి కట్టుబడి ఉన్నాయా అన్న సందేశం కలుగుతోందని చురకలు అంటించారు.

---

### భారత స్వాతంత్య్రోద్యమంలో సాయుధ పోరాటం చేసి

# అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్

## - నేడు చంద్రశేఖర్ ఆజాద్ జయంతి



భారత స్వాతంత్య్రోద్యమంలో దేశమాత విముక్తి కోసం సాయుధ పోరాటం చేసి అమరుడైన వీరుడు చంద్రశేఖర్ ఆజాద్.. అజాద్ ఈ పేరు వింటే చాలు తెల్లదొరలు గుండెల్లో రైళ్లు పరిగెత్తేవి. ఎక్కడ ఏ విధ్వంసానికి పథకం రచించి, తమపై దాడి చేస్తాడోనని ప్రాణాలు అరచేతబెట్టుకునేవారు. బ్రిటిషర్ల దాస్య శృంఖలాల నుంచి భరతమాతకు విముక్తి కలిగించడం కోసం ఎందరో మహాత్ములు తమ ప్రాణాలను ఫణంగా పెట్టారు. మరెందరో వీరులు ఉరికంబమెక్కారు. అలాంటి వారిలో ముఖ్యులు భగత్ సింగ్, చంద్రశేఖర్ అజాద్. అత్యంత పిన్నవయసులోనే దేశం కోసం తమ జీవితాన్నే అర్పించిన మహా పురుషులు. దేశం గర్వించదగ్గ ఆ మహాపురుషుల్లో చంద్రశేఖర్ అజాద్ కూడా ఒకరు. భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్, పండిత్ రామ్ ప్రసాద్ బిస్మిల్, ఠాకూర్ రోషన్ సింగ్, ప్రేమ్ కిషన్ ఖన్నా మరియు అష్ఫాకుల్లా ఖాన్‌ల సహచరుడిగా బ్రిటీషువారి గుండెల్లో రైల్లు పరిగెత్తించిన చంద్రశేఖర్ ఆజాద్ మనదేశం గర్వించదగ్గ అసమాన వీరుడు. భగత్ సింగ్ మార్గ నిర్దేశకుడిగా పేరుగాంచిన ఆజాద్ పూర్తిపేరు చంద్రశేఖర సీతారామ్ తివారి.

ఈయన పండిత్‌జీగా కూడా పిలువబడ్డారు. మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఝాబువా జిల్లా, బావ్రా (భాబ్ గా) గ్రామంలో పండిట్ సీతారామ్ తివారి, జగరానీ దేవీలకు 1906 జూలై 23వ తేదీన చంద్రశేఖర్ ఆజాద్ జన్మించారు. ప్రాథ మిక విద్యను సొంత గ్రామంలోనే పూర్తి చేసిన ఈయన వారణాసిలో సంస్కృత పాఠశాలలో హయ్యర్ సెకండరీ విద్యను అభ్యసించారు. 1919లో అమృత్ సర్‌లో జరిగిన జలియన్ వాలాబాగ్ దుర్ఘటనతో తీవ్రంగా కలత చెందిన ఆజాద్.. ఆ తరువాత 1921లో మహాత్మాగాంధీ నడిపిన సహాయ నిరాకరణోద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఈ ఉద్యమంలో పాల్గొన్న నేరానికిగానూ ఈయన తన పదిహేనేళ్ల ప్రాయంలోనే అరెస్టయ్యారు.విచారణ సందర్భంగా కోర్టులో "నీ పేరేంటి?" అని మెజిస్ట్రేట్ అడిగిన ప్రశ్నకు ఆయన పెద్ద శబ్దంతో "ఆజాద్" అని అరచి చెప్పారు. దాంతో ఆయనకు మెజిస్ట్రేట్ 15 కొరడా దెబ్బలు శిక్షగా విధించాడు. అయితే ప్రతి కొరడా దెబ్బకు ఆయన భారత్ మాతాకీ జై (వందేమాతరం) అంటూ గొంతెత్తి నినదించారు. ఇక అప్పటినుంచి చంద్రశేఖర్ ఆజాద్‌గా ఆయన పేరు స్థిరపడిపోయింది. సహాయ నిరాకరణో ద్యమం ఆజాద్‌లో దాగి ఉన్న విప్లవవాదిని మేల్కొ లిపింది. ఎలాగైనా సరే భారతదేశాన్ని బ్రిటీష్‌వారి కబంధ హస్తాల నుంచి విడిపించాల్సిందే నని ఆయన బలంగా నిశ్చయించుకున్నారు.

అనుకున్నదే తడవుగా ఆయన హిందూస్థాన్ సోషలిస్ట్ రిపబ్లికన్ అసోసి యేషన్‌ను స్థాపించారు. భగత్ సింగ్, సుఖదేవ్, తదితరులకు మార్గనిర్దేశకుడిగా మారారు. 1928వ సంవత్సరంలో పోలీసుల దాడిలో తీవ్రంగా గాయపడి కన్నుమూసిన 'పంజాబ్ కేసరీ లాలాలజపతిరాయ్ మృతికి ప్రతికారంగా రాజ్ గురు, భగత్ సింగ్, బ్రిటీష్ పోలీస్ అధికారి సాండర్స్ ను కాల్చి చంపగా, సాండర్స్ వెంట వచ్చిన హెడ్ కానిస్టేబుల్ రాండ్ ను అజాద్ కాల్చి చంపాడు. ఉత్తర ప్రదేశ్, పంజాబ్ ప్రభుత్వాలు ఆజాద్ ను సజీవంగా పట్టుకునే ప్రయత్నం చేశాయి. అతనిని ప్రాణాలతో తీసుకువచ్చినా లేక చంపి తెచ్చినా 30 వేల రూపాయలు బహుమతిగా ప్రకటించారు. అ రోజు 1931, ఫిబ్రవరి 27, శుక్రవారం అలహా బాదులో నిల్ఫ్రెడ్ పార్క్‌కు చేరుకోగా, ఇన్ఫార్మర్లు ఇచ్చిన సమాచారం మేరకు బ్రిటీష్ పోలీసులు చుట్టుముట్టారు. ఆజాద్‌ను లొంగిపోవాలంటూ హెచ్చరికలు చేశారు. అయినా కూడా మొక్కవోని ధైర్యంతో పోలీసులకు లొంగకుండా, ఒక్కడే పోరాడుతూ ముగ్గురు పోలీసు లను హతమార్చారు.


అలసిపోయేదాకా పోరాడిన ఆయన చివరి క్షణంలో తన వద్ద మిగిలిన ఒకే ఒక్క బుల్లెట్‌తో తనను తానే కాల్చుకుని అశువులు బాసారు. అజాద్ పోరాడిన తీరు భారతదేశ విప్లవ చరిత్రకే వన్నె తెచ్చిన ఘటన. భారతీయ యువత ముందు నిలిచిన ఒక మహోజ్వల ఉదాహరణ.

---

### స్వరాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని

# గర్జించిన ధీరుడు బాలగంగాధర తిలక్

## - నేడు బాలగంగాధరతిలక్ జయంతి



**స్వ**రాజ్యం నా జన్మహక్కు..దాన్ని నేను పొంది తీరుతాను అని స్వాతంత్ర పోరాటంలో గర్జించిన ధీరుడు లోకమాన్య బాలగంగాధరతిలక్. దేశవ్యాప్తంగా సామాన్యప్రజల్ని భారతజాతీయో ద్యమంలో పాల్గొనే టట్లు చేయడంలో బాలగంగాధర తిలక్ సఫలీకృ తుడయ్యారు. అందుకే ఆయనను భారత దేశంలో బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకం గా రేగిన అశాంతికి మూలకారకుడు గా భావిస్తారు. అతను జాతీయోద్య మాన్ని కొత్తపుంతలు తొక్కించడం తో ఆయనను భారతజాతీయోద్యమ పితగా పేర్కొంటారు.

ఇతనికి లోక మాన్య అనే బిరుదు కూడా ఉంది.మహాత్మా గాంధీ అతన్ని "ఆధునిక భారతదేశపు మేకర్" అని పిలిచారు. బాలగంగాధరతిలక్ 1856 జులై 23వ తేదీన మహారాష్ట్ర లోని రత్నగిరిలో జన్మించాడు. తండ్రి గంగాధర్ రామచంద్ర తిలక్ సంస్కృత పండితుడు. తల్లి పార్వతీ బాయి ఆధ్యాత్మిక సంపన్నురాలు, బాల్యం లో తిలక్ చాలా చురుకైన విద్యార్థి. ప్రత్యేకించి గణిత శాస్త్రంలో ఆయన విశేష ప్రతిభ కనబరచేవాడు. చిన్నప్పటి నుంచి అన్యాయం ఎక్కడ జరిగినా సహించని గుణమాయనది. నిజాయితీ తో బాటు ముక్కుసూటితనం ఆయనకు సహజం. కళాశాలకు వెళ్ళి ఆధునిక విద్యనభ్యసించిన తొలితరం భారతీయ యువకుల్లో ఆయనొకడు. తిలక్‌కు పదేళ్ళ వయసున్నప్పుడు ఆయన తండ్రికి రత్నగిరి నుంచి పుణెకు బదిలీ అయింది. ఇది తిలక్ జీవితంలో పెనుమార్పు తీసుకువచ్చింది.

పుణె ఆంగ్లోవెర్నాకులర్ పాఠశాలలో చేరి కొందరు ప్రసిద్ధి చెందిన ఉపాధ్యాయుల వద్ద విద్యనభ్యసించాడు. ఐతే పూణెకు వచ్చిన కొంతకాలానికే ఆయన తన తల్లిని, పదహారేళ్ళ వయసులో తన తండ్రిని కోల్పోయాడు. మెట్రిక్యులేషన్ చదువుతున్నప్పుడే సత్యభామ అనే పదేళ్ళ అమ్మాయితో పెళ్ళయింది. మెట్రిక్ పాసయ్యాక దక్కన్ కళాశాలలో చేరాడు. 1877లో తిలక్ గణితశాస్త్రంలో ప్రథమశ్రేణిలో పట్టభద్రుడయ్యాడు. ఆ తర్వాత తనచదువును కొనసాగించి ఎల్.ఎల్.బి. పట్టా కూడా పొందాడు తిలక్. 1890లో కాంగ్రెస్ లో సభ్యుడుగా చేరాడు. కానీ త్వరలోనే తిలక్ కు కాంగ్రెస్ మితవాద రాజకీయాలపై నమ్మకం పోయింది. స్వరాజ్యం కోసం పోరాటమే సరైన మార్గమని నమ్మాడు. అప్పటివరకు కాంగ్రెస్ ప్రతి సంవత్సరం డిసెంబరు చివరివారంలో మూడు రోజులపాటు సమావేశమై బ్రిటిష్ ప్రభుత్వాన్ని, ప్రభుత్వ విధానాలను "ప్రార్థించు, వినతి, నిరసన" చెయ్యడానికే పరిమితమైంది. తిలక్ దాని గురించి చాలా ఘాటైన విమర్శలు చేశాడు. "మీరు సంవత్సరానికొకసారి మూడు రోజులపాటు సమావేశమై కప్పల మాదిరి బెకబెకలాడడం వల్ల ప్రయోజనం లేదు." అని, "అసలు కాంగ్రెస్ సంస్థ అడుక్కునేవాళ్ళ సంఘం (బెగ్గర్స్ ఇన్స్టిట్యూషన్)" అన్నాడు. కాంగ్రెస్ సమావేశాలను 3-డే తమాషాగా అభివర్ణించాడు. "స్వరాజ్యం నా జన్మహక్కు. దాన్ని నేను పొంది తీరుతాను." అని గర్జించాడు.""1907లో మహారాష్ట్రలోని సూరత్‌లో జరిగిన సమావేశంలో కాంగ్రెస్ చీలిపోయింది. మితవాదులు కాంగ్రెస్ పై తమ పట్టును నిలబెట్టుకున్నారు.

అతివాదులుగా పిలవబడే తిలక్ మద్దతు దారులు కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చేశారు. తిరిగి 1916లో లక్నోలో జరిగిన సమావేశంలో అంతా ఒకటయారు. అదే సమావేశంలో కాంగ్రెస్ కు, ముస్లిం లీగుకు మధ్య లక్నో ఒప్పందం కుదిరింది. తిలక్ పాశ్చాత్యవిద్యావిధానాన్ని తీవ్రంగా వ్యతిరేకిచాడు - అది భారతీయ సాంస్కృతికవారసత్వాన్ని అగౌరవపరచి భారతీయ విద్యార్థులను చిన్నబుచ్చేవిధంగా ఉందని. ప్రజలకు మంచి విద్యను అందించడం ద్వారానే వాళ్ళను మంచి పౌరులుగా మార్చవచ్చనే ఉద్దేశం బాలగంగాధరతిలక్ ది. భారతీయులకు భారతీయ సంస్కృతి గురించి, భారతదేశపు ఔన్నతాన్ని గురించి బోధించాలని ఆయన ఆశయం. అందుకే అగార్కర్, విష్ణుశాస్త్రి చిప్లుంకర్ లతో కలిసి దక్కన్ ఎడ్యుకేషనల్ సొసైటీ ని స్థాపించాడు. ఆ తర్వాత తాను నడిపిన పత్రికలు మరాఠా(ఆంగ్ల పత్రిక), కేసరి(మరాఠీ పత్రిక) లలో మొద్దు నిద్రపోతున్న భారతీయులను మేల్కొల్పడానికి పదునైన భాషలో బ్రిటిష్ పాలనలోని వాస్తవ పరిస్థితుల గురించి వివరంగా రాశాడు.

బాల్యవివాహాలను నిరసించి వితంతు వివాహాలను స్వాగతించాడు. జాతీయస్ఫూర్తిని రగల్చడానికి వీలున్న ఏ అవకాశాన్నీ ఆయన వదిలిపెట్టలేదు. మొట్టమొదటిసారిగా శివాజీ ఉత్సవాలను, గణపతి ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించడం ద్వారా ప్రజలను సమీకరించడం, వారిని జాతీయోద్యమం వైపు నడిపించడం తిలక్ మొదలుపెట్టాడు. పత్రికల్లో ప్రజలను రెచ్చగొట్టే రాతలు రాసినందుకు 1897లో తిలక్ కు ఒకటిన్నరేళ్ళు కారాగారశిక్ష పడింది. విడుదలయ్యాక స్వదేశీ ఉద్యమాన్ని ప్రారంభించాడు. 1906లో దేశద్రోహం నేరం క్రింద ఆరేళ్ళు ప్రవాసశిక్ష విధించారు. కారాగారంలో ఉన్నప్పుడే గీతారహస్యం అనే పుస్తకం రాశాడు, చరిత్రకారుడు కూడా. ఆర్యులు ఆర్కిటిక్ ప్రాంతం నుంచి వచ్చారని అభిప్రాయం. 1916 ఏప్రిల్ లో హోంరూల్ లీగ్ను స్థాపించి దాని లక్ష్యాలను వివరిస్తూ మధ్యభారతదేశంలో గ్రామగ్రామానా తిరిగాడు.

అనీబిసెంటు అదే సంవత్సరం సెప్టెంబర్లో మొదలుపెట్టి హోంరూల్ ఉద్యమాన్ని దేశవ్యాప్తం చేసింది. ఆ ఉద్యమం ఉధృతంగా కొనసాగుతున్న సమయంలో ఒక కోర్టుకేసులో లండనుకు వెళ్ళవలసి వచ్చింది. అప్పుడే, అంటే 1917 ఆగస్టులో అప్పటి సెక్రటరీ ఆఫ్ స్టేట్ మాంటేగు బ్రిటిష్ సామ్రాజ్యంలో భాగమైన భారతదేశంలో బాధ్యతాయుత ప్రభుత్వాన్ని ఏర్పరచడానికి వీలుగా అన్ని పాలనాంశాల్లో భారతీయులకు అధిక ప్రాధాన్యాన్నివ్వడమే ప్రభుత్వ విధానమని బ్రిటిష్ ప్రభుత్వం తరపున ప్రకటించాడు. బాధ్యతాయుత ప్రభుత్వమంటే ఎవరికి బాధ్యత వహించే ప్రభుత్వమో, అధిక ప్రాధాన్యమంటే ఎంత ప్రాధాన్యమో, అసలు అది ఎప్పుడిస్తారో ఏదీ స్పష్టంగా లేదు. కానీ బ్రిటిష్ ప్రభుత్వ నిజాయితీని నమ్మిన అనీబిసెంటు ఆ ప్రకటనతో ఉద్యమాన్ని అపేసి ప్రభుత్వానికి తన మద్దతు ప్రకటించింది.

అలా ఇద్దరు నాయకులదీ చెరొకదారీ కావడంతో హోంరూల్ ఉద్యమం చల్లబడిపోయింది. కానీ ప్రజల్లో తిలక్ రగిలించిన స్ఫూర్తి మాత్రం కొనసాగింది. 1920 ఆగస్టు 1వ తేదీన బొంబాయిలో 64 ఏళ్ల వయసులో బాలగంగాధర్ తిలక్ స్వర్గస్తులయ్యారు.

## రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌లో
# ఏర్పాట్లను పూర్తి చేయాలి

### - జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్, డైరెక్టర్ ఆర్‌టిఐహెచ్

**అనంతపురం కలెక్టరేట్ – సూర్య వాస్తవం, జులై 22 :** జేఎన్టీయూలో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ అతి త్వరలో ప్రారంభం కానున్న నేపథ్యంలో అన్ని విధాలా ఏర్పాట్లను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ మరియు రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్ డైరెక్టర్ శివ్ నారాయన్ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం ఉదయం అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ సహార్ తో కలిసి అనంతపురం నగరంలోని జేఎన్టీయూ అడ్మిన్ బిల్డింగ్ లో ఏర్పా ట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంచార్జ్ జిల్లా కలెక్టర్ ఇప్పటివరకు జరిగిన పనుల గురించి సమీక్షించారు. రతన్ టాటా ఇన్నోవేషన్ సెంటర్‌ను త్వరలో ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. దీనికై అవసరమైన మేరకు అన్ని రకాల ఏర్పాట్లను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా బిల్డింగ్ సెంటర్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచేలా చూడాలని విద్యార్థులకు ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏవైనా పెండింగ్ పనులు ఉంటే పూర్తి చేయాలని ఆదేశించారు. అంతకుముందు సెంటర్‌లో ఇప్పటివరకు జరిగిన పనుల నాణ్యతను పరి శీలించారు. అలాగే విద్యార్థుల తరగతి గదులు, కాన్ఫరెన్స్ హాల్, ఇతర



గదులను పరిశీలించారు. సెంటర్‌లో అవసరమైన మేరకు మౌలిక ్సదుపాయాలతో పాటు ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌ను ఏర్పాటు చేయాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. అలాగే బోర్డు సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని, టాస్క్ ఫోర్స్ బృందంతో ఎం ఎస్ ఎం ఈ సమావేశం నిర్వహణ ను జిల్లా పరిశ్రమల శాఖ, గ్రామ వార్డు సచివాలయ సమన్వయకర్త తదితర అధికారులతో సమన్వయం చేసుకోవాలని స్కిల్ డెవలప్మెంట్ అధికారికి ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సెంటర్ ఓ.ఎస్. డి .దీప్తి, ఆర్.అండ్.బి. ఎస్.ఈ మురళీకృష్ణ, డిఈ వి.రాజగోపాల్, జిల్లా స్కిల్ డెవలప్మెంట్ అధికారి ప్రతాపరెడ్డి, ఉద్యాన శాఖ డిడి ఉమాదేవి, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీనివాస్, ఆర్.అండ్.బి జెఈ బాల కాటమయ్య, హార్టికల్చర్ అధికారి రత్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## రాయచోటి - పింఛా రహదారి
# నిర్మాణ పనుల్లో ఎంతమంది చనిపోవాలి!?

### - డిసిసి అధ్యక్షుడు గాజుల భాస్కర్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో నిరసన

**రాయచోటి – సూర్య వాస్తవం, జులై 22:**

అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి నుంచి పింఛా వరకు వెళ్లే ప్రధాన రహదారి పొడుగునా గుంతల మయం, చినుకు పడితే రోడ్డుపై గుంతలన్నీ బావుల్లాగ దర్శనమిస్తాయని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ అన్నారు. మంగళవారం రాయచోటి– పింఛా రహ దారిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో కలిసి ఆయన సంద ర్శించారు. ఈ సందర్భంగా గాజుల భాస్కర్ మాట్లాడుతూ రోడ్డంతా అధ్వానంగా ఉంది. ఈ ప్రాంతంలో వివిధ వాహ నాలలో ప్రయాణించే ప్రజలు ప్రతి నరకం చూడాల్సి వస్తుంద రోజు ప్రాణాల మీదన్నారు.

ముఖ్యంగా శిబ్యాల గ్రామం వద్ద వంతెన నిర్మాణ పనులు గత కొన్నేళ్లుగా అర్ధాంతరంగా నిలిచిపోయి ఉండగా, ప్రయాణికులకు ప్రమాదాలే మిగిలాయి. ఈ మార్గంలోని దుస్థితిని గమ నించి, ప్రభుత్వ నిర్లక్ష్యంపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అన్నమయ్య జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజుల భాస్కర్ పార్టీ శ్రేణులతో కలిసి సిబ్యాల రోడ్డుపై కాంగ్రెస్ జెండలు పట్టుకుని నిరసన వ్యక్తం



చేశారు. రాష్ట్ర రవాణా శాఖ మంత్రిగా మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి నియోజక వర్గంలోని ఈ ప్రధాన రహదారి దయనీయ స్థితిలో ఉండటం దురదృష్టకరమని గాజుల భాస్కర్ చెప్పారు. గతంలో ఎన్నో ప్రమాదాలు జరిగి పలువురు మృతి చెందగా, మరికొంత మంది శాశ్వతంగా మంచానికే పరిమితమయ్యారని ఆయన చెప్పారు. ఇంకా ఎంతమంది చనిపోతే రాష్ట్ర ప్రభుత్వం స్పందిస్తోందో నాకైతే అర్థం కావడం లేదని అన్నారు. వెంటనే ఈ వంతెన పనులను తిరిగి ప్రారంభించి, రహదారి మరమ్మతులు పూర్తి చేయాలని ఆయన ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

## జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో
# ప్రాజెక్టుల విషయంలో రాయలసీమకు అన్యాయం

### - కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రాయలసీమను సస్యశ్యామలం చేసే విధంగా చర్యలు
### -- గాజుల ఖాదర్ బాషా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకుడు కుప్పం పరిశీలకులు

**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, జూలై 22:** జగన్ రెడ్డి ఐదేళ్ల పాలనలో ప్రాజెక్టుల విషయంలో రాయలసీమకు పూర్తిగా అన్యాయం జరిగిందని గాజుల ఖాదర్బాషా పేర్కొన్నారు. మంగళవారం నాడు మంత్రి రాంప్రసాద్ రెడ్డి క్యాంపు కార్యాలయం నందు ఆయన విలేకరుల సమా వేశంలో మాట్లాడుతూ...హంద్రీనీవా ప్రాజెక్టును 1996 మార్చి 11వ తేదీన ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారని తెలిపారు. తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాయలసీమను సస్యశ్యామలం చేసే విధంగా నాలుగు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే విధంగా హంద్రీనీవా స్రవంతి ప్రాజెక్టును ఫేస్ వన్.. ఫేస్ టుగా రూపొం దించడం జరిగిందని తెలిపారు 13635 కోట్ల రూపాయలు వరకు పరిపాలన అనుమతులు కూడా ఇవ్వడం జరిగింది అని తెలిపారు దాదాపుగా 11535 కోట్ల రూపాయల వరకు టిడిపి ప్రభుత్వమే హంద్రీనీవా ప్రాజెక్టు ఖర్చు చేయడం జరిగింది అని తెలిపారు. 2014 2019 సంవత్సరంలో హంద్రీనీవా ప్రాజెక్టుకు 4182 కోట్లు ఖర్చు చేసి 80% వరకు పనులు పూర్తి చేయడం జరిగింది అని తెలిపారు కాల్వ విస్తీర్ణాన్ని కూడా పది మీటర్ల నుంచి 16.5 మీటర్లు వెడల్పు చేసి 40 టి ఎం సి ఇలా నీరు తరలించే విధంగా తెలుగుదేశం ప్రభుత్వం చర్యలు తీసుకోవడం జరిగిందని తెలిపారు. టిడిపి ప్రభుత్వం 2014... 2019



వసంవత్సరంలో 12441 కోట్ల రూపాయలు ఖర్చు చేస్తే వైసిపి ప్రభుత్వం కేవలం 2011 కోట్ల రూపాయలు మాత్రమే ఖర్చు చేయడం జరిగింది జగన్మోహన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత రెండేళ్లలోనే హంద్రీనీవా ప్రాజెక్టు ఫేస్ వన్ కింద మిగిలిన పనులు పూర్తి చేస్తానన్న హామీని జగన్ విస్మరించారని చెప్పారు జగన్ హయంలో బిల్లులు రాక పనులు కూడా ఎక్కడికక్కడే ఆగిపోయాయని 7.6. 2021వ తేదీన ఒక చీకటి జీవో నెంబర్ 30 ద్వారా 1977 కోట్ల రూపాయలకు అంచనాలు పెంచుకొని దోచుకునే ప్రయత్నం చేశారని తెలిపారు కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే ఫేస్ టు ఫేస్ వన్ కి 3,873 కోట్ల రూపాయలు ఖర్చు చేశారని చెప్పారు ఫేస్ వన్ కింద 198000 ఎకరాలకు మరియు ఫేస్ టు కింద 404500 ఎకరాలకు రాయలసీమలోని నాలుగు జిల్లాల్లో ఆరు లక్షల 2500 ఎకరాలకు సాగునీరు లభిస్తుందని తెలిపారు.మొత్తం 81 మండలాల్లో 33 లక్షలు మందికి తాగునీటి సరఫరా కు అవకాశం లభిస్తుందనితెలిపారు. ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ నాగేశ్వర్ నాయుడు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మెంబర్ బుజ్జి తెలుగుదేశం పార్టీ నాయకులు బసిరెడ్డి శివారెడ్డి మురళి తదితరులు పాల్గొన్నారు.



# రోగులకు వైద్యులు అందుబాటులో ఉండాలి

### - పీహెచ్‌సీని తనిఖీ చేసిన రాయచోటి తహశీల్దార్ నరసింహా కుమార్

**అన్నమయ్య బ్యూరో – సూర్య వాస్తవం, జూలై 22:** అన్నమయ్య జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఎండ్లపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని రాయచోటి తహశీల్దార్ నరసింహకుమార్ సందర్శించారు. రోగులకు మంచి వైద్యం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. ఫార్మసీ నుండి మందులు తీసుకున్న తరువాత వైద్యుల సూచన మేరకు పేషెంట్లకు సూచనలు ఇవ్వడం జరిగింది. పరిశుభ్రత సంతృప్తికరంగా ఉంది అని ల్యాబ్ టెక్నీషియన్ రాజేంద్ర తన విధులను మంచిగా నిర్వర్తిస్తున్నారు. రోగులకు సరైన మార్గనిర్దేశం చేస్తున్నారు అని వారిని కొనియాడారు. వైద్యశాలలో రోగులకు మంచి వైద్యం ఇచ్చినప్పుడే ఆ గ్రామపంచాయతీ పరిధిలోని ప్రజలకు దృష్టిలో పడి మంచి పేరు వస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాలలో వైద్యులకు మంచి గుర్తింపు రావాలంటే ప్రజలకు మంచి సేవ చేసినప్పుడే మంచి పేరు వస్తుందని అన్నారు. అనంతరం వైద్యశాలలోని పేషెంట్స్‌లో తదితర సంబంధించిన రికార్డుల ను ఆయన పరిశీలించారు. హాస్పిటల్ సిబ్బందికి సూచనలు సలహాలు అందజేశారు.

# ప్రజల కోసం జన సేవ దళ్

### - సిపిఐ రామకృష్ణ



**రాప్తాడు – సూర్య వాస్తవం, జూలై 22:** ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న సిపిఐ పార్టీ అనుబంధంగా పనిచేస్తున్న జన సేవ దళ్ కూడా మరింత చురుగ్గా శక్తివంతంగా ప్రజలకు సేవలు అందించడానికి సిద్ధంగా ఉందని సీపీఐ నియోజవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ పేర్కొన్నారు.రాప్తాడు మండల కేంద్రంలోని సిపిఐ కాలనీ నందు జాతీయ శిక్షణ బోధకులు కే.మురళి కృష్ణ రాష్ట్ర శిక్షణ బోధకులు వి.జాన్సన్ బాబు ఆధ్వర్యంలో జన సేవ దళ్ శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సంధర్భంగా సీపీఐ నియోజవర్గ కార్యదర్శి పి.రామకృష్ణ మాట్లాడుతూ జన సేవ దళ్ ఉద్దేశ్యం శ్రమజీవుల సమస్యలపై స్పందించడంతో పాటు విపత్తు పరిస్థితుల్లో సహాయక చర్యలు చేపట్టడం ఆరోగ్య శిబిరాలు నిర్వహించడం రక్తదానం పారిశుద్ధ్య కార్యక్రమాలు సామాజిక సమస్యలు పరిష్కారం పై చైతన్యం కలిగిస్తున్నా మన్నారు. రాజకీయంతో పాటు ప్రజల మధ్య సామాజిక బాధ్యతతో పని చేయాలన్న ఉద్దేశంతో జన సేవ దళ్‌ను ఏర్పాటు చేశామన్నారు. యువత ఈ ఉద్యమంలో భాగ స్వాములు కావాలి. సేవే సమాజాన్ని మార్చే మార్గం సీపీఐ ప్రజల కోసం ప్రజల పక్షాన నిరంతరం ఉంటుందన్నారు. సేవాదళం పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా ముందుకు సాగుతుందన్నారు.జన సేవ దళ్ అనేది మానవతా విలువల ఆధారంగా ప్రజలకు తోడుగా నిలిచే బృందంగా రూపుదిద్దుకుంటుంది.ప్రతి బస్తీలో ప్రతి వార్డులో ప్రతి గ్రామంలో ప్రజల సమస్యలపై స్పందించేలా ఇది పనిచేస్తుంది. ముఖ్యంగా యువతను ఈ దళంలో చురుకుగా భాగస్వాములు కావాలని పిలుపనిచ్చారు.ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర ఆర్గనైజేషన్ కార్యదర్శి సంతోష్ కుమార్ సిపిఐ రాప్తాడు నియోజకవర్గ సహాయ కార్యదర్శి శ్రీకాంత్ రాప్తాడు మండల కార్యదర్శి రవీంద్ర రూరల్ మండల కార్యదర్శి రమేష్ సహాయ కార్యదర్శి నరేష్ ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ధనుంజయ ఏఐటీయూసీ నాయకులు దుర్గాప్రసాద్ శాఖా కార్యదర్శులు ప్రసాద్ అక్కులప్ప రెడ్డప్ప ప్రజలు పాల్గొన్నారు.

# గుత్తిలో పాస్టర్ల సేవకుల సదస్సు

**గుత్తి –సూర్యవాస్తవం, జులై 22 :** గుత్తి పట్టణంలో చర్చి పాస్టర్స్ అ సోషియేషన్ ఆధ్వర్యంలో మంగ ళవారం శ్రీనివాస (సితార) ఫంక్షన్ హాల్ ప్రక్కన రాక్ చర్చిలో సే వకుల సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దైవ సేవకులు పాస్టర్లు సువార్తికులు హాజరై దైవ సందేశాన్ని విన్నారు.ఈ సదస్సుకు ముఖ్య ప్రసంగికులు రెవరెండ్ డాక్టర్ ఎన్.తి మోతిరావు, సూప రింటెండెంట్ ఆఫ్,ఎ.జి చర్చి,రెవ యెషయా అనంతపురం జిల్లా పా స్టర్స్ సొసైటీ వారు దైవ సందేశా న్ని అందించి ఆధ్యాత్మిక విషయాలు తెలియజేశారు. ఈ సేవకుల సదస్సుకు గుత్తి మండలంలోని పా స్టర్లు, గార్లదిన్నె, పామిడి గుంతకల్లు, జొన్నగిరి, యాడికి, మండలముల దైవసేవకులు పా ల్గొని దైవ ఆశీర్వాదాలు పొందారు. ఈ కార్యక్రమంలో గౌరవ అధ్య క్షులు రెవరెండ్ జె.సాలోమెన్, గౌరవ సలహాదారులు రెవరెండ్ బి. డేవిడ్ నాయక్, గౌరవ కార్య ని ర్వాహక అధ్యక్షులు,రెవరెండ్ ఎ న్.గాబ్రియేల్ ప్రసాద్, ప్రెసిడెంట్ రెవరెండ్ ఎస్.మాథ్యూ,వైస్ ప్రెసి డెంట్ రెవరెండ్ పి.చంద్రసేన,సెక్ర టరి రెవరెండ్ యం.అనిల్ బాబు జాయింట్ సెక్రటరి రెవరెండ్ డి. చంద్ర శేఖర్, ట్రెజరర్ రెవరెండ్ పి.శేఖర్, ఇ.సి.మెంబెర్స్ పాస్టర్ జె.సుధాక ర్,రెవరెండ్ యం.ఫిలి ప్,రె వరెండ్ బి.శ్యామ్ ల్,పాస్టర్ బి.ప్రభుదాస్, పాస్టర్ ఎ.రాజేష్ పాస్టర్ బి.ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.



## ముఖ్యమంత్రిని కలిసిన కాకతీయ సేవా సమితి అధ్యక్షులు



**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, జూలై 22:** రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని రాష్ట్ర సచివాలయంలో శివన్నారాయన గోళ్లపుటి అధ్యక్షులు మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. రాజంపేట నియోజకవర్గంలో ప్రస్తుత రాజ కీయాల గురించి వివరించడం జరిగినది .శివ న్నారాయణ చౌదరి గొల్లపూటి అధ్యక్షులు కాకతీయ సేవా సమితిలో అంటూ, అన్నమయ్య జిల్లా టీడీపీ నాయకులుగా ఉన్నారు.

## ఊతకల్లు గ్రామంలో హుండీలు చూపుతున్న ఆర్డీటీ మహిళలు



**గుత్తి –సూర్య వాస్తవం, జూలై 22 :** గుత్తి మండలం ఊటకల్లు గ్రామం ఆర్డిటి స్కూలు నందు మిద్దె ఓబు లేష్ ఆధ్వర్యంలో స్పందించు సాయం అందించు, నినాదంతో ఎంతో మంది పేద కుటుంబాలను ఆ దుకోవచ్చని ఆర్డీటీ ప్రతి నిధులు పేర్కొన్నారు. గుత్తి మండలంలోని ఊటకల్లు గ్రామంలో సాయంత్రం గ్రామంలోని మహిళలకు హుండీలను అందజేశారు. ఈ సందర్భంగా ఆర్డీటీ సంస్థ ఏటీఎల్ నారా యణ మాట్లాడుతూ రోజూ హుండీల్లో వేసిన నగదును ఏడాది త ర్వాత పేద కుటుంబాలు, విద్యా ర్థుల సేవకు వినియోగిస్తామన్నారు. త్వరలో గుత్తిలో ఆర్డీటీ మహిళా సంఘాలకు సంబంధించిబ్యాం కును ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్య క్రమంలో సీవో నాగమణి, గ్రామస్థులు వినోద్, జయరాం, మిద్దె ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

## జోకా సురేంద్రబాబు భౌతిక కాయానికి నివాళులు

### - నివాళులు అర్పించిన రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి సుగవాసి ప్రసాద్ బాబు





**అన్నమయ్య బ్యూరో– సూర్య వాస్తవం, జూలై 22:** రాయచోటి పట్టణం కె.రామాపురం వాస్తవ్యులు జోకా సురేంద్రబాబు అనారోగ్యంతో మరణించిన విషయం తెలిసి రాష్ట్ర టిడిపి కార్యనిర్వాహక కార్యదర్శి టీటీడీ పాలకమండలి మాజీ సభ్యులు రాయచోటి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సుగ వాసి ప్రసాద్ బాబు వారి స్వగృహానికి వెళ్లి భౌతిక కాయానికి నివాళులు అర్పించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

## 'సుపరిపాలనలో తొలి అడుగు'లో 17వ వార్డు ఇన్‌ఛార్జి ఎస్‌ఎం బాషా

**గుత్తి–సూర్య వాస్తవం,జులై 22:** గుత్తి గుంతకల్లు నియోజకవ ర్గం శాసన సభ్యులు గుమ్మనూరు జ యరాం ఆదేశాలు మేరకు వారి త నయుడు గుత్తి,పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ సూచనలతో గుత్తి పట్టణ అధ్య క్షుడు ఎంకె చౌదరి సహకారంతో గుత్తి పట్టణం 17వ వార్డ్ లో 17వ వార్డు ఇంచార్జ్ మైనార్టీ సీనియర్ నాయకులు ఎస్ ఎం భాష ఆధ్వ ర్యంలో 17వ వార్డు 180 బూతు లో సుపరిపాలన తొలి అడుగు లో భాగంగా డోర్ టు డోర్ పర్య టించి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను గురించి వారికి వివరించి వారి సమస్యల ను అడిగి తెలుసుకోవడం జరిగిం ది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న గు త్తి పట్టణ 17 వార్డు 180 బూత్ కన్వీనర్లు రసూల్, అశోక్,యాదుళ్ళ, తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన డం జరిగింది.



# పామిడిలో 'బాబు ష్యూరిటీ- మోసం గ్యారంటీ'



**పామిడి–సూర్యవాస్తవం,జూలై 22 :** గుంతకల్లు నియోజకవర్గంలోని పామిడిలో వైసీపీ సమన్వయకర్త వై.వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ' కార్యక్రమం.. ముఖ్య అతిథిగా హాజరైన వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి , వైస్సార్సీపీ ఆర్గనైజేషన్ పెమ్మక చెన్నకేశవరెడ్డి , టౌన్ కన్వీనర్ నాగూర్ ఈశ్వర్ రెడ్డి, మండల కన్వీనర్ రామకృష్ణ నాయక్ ఏడాదిగా కూటమి ప్రభుత్వ వైఫ ల్యాలను ఎండగట్టిన నాయకులు.. రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో పోస్టర్లు ఆవిష్కరణ అనంత వెంకటరామిరెడ్డి కామెంట్స్ఎన్నికల సమయంలో చంద్రబాబు సూపర్ సిక్స్‌తో పాటు 143 హామీలు ఇచ్చారు. ఏడాది గడిచినా హామీలను అమలు చేయలేదు. చంద్రబాబు ఏ ఎండకు ఆ గొడుగు పట్టేరకం. ప్రజలను మోసం చేయడంలో చంద్రబాబు దిట్ట. చంద్రబాబు ఎప్పుడు అధికారంలోకి వ చ్చినా ప్రజలు మోసపోతూనే ఉన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తొలి ఏడాది కాలంలో ఒక్క హామీని అమలు చేయలేదు. సంవత్సర కాలంలో ఈ ప్రభుత్వం ప్రజలకు రూ.81 వేల కోట్లు బాకీ పడింది. ప్రజల పక్షాన వైసీపీ పోరాటం చేయడం వల్ల తల్లికి వందనం పథకాన్ని అరకొరగా అందించారు. ఇంకా లక్షలాది మందికి పథకం అందలేదు. 2024–25 సంవత్సరంలో తల్లికి వందనంను చంద్రబాబు ఎగ్గొట్టారు. రైతుకు ఆర్థిక సాయం అందించాలని కోరితే 'మోదీ ఇస్తేనే' నేను ఇస్తానని చంద్రబాబు అంటున్నాడు. నిరుద్యోగులకు రూ.3 వేలు నిరుద్యోగ భృతి అందలేదు. 18 ఏళ్లు నిండిన మహిళలకు ప్రతి నెలా రూ.1500 ఇస్తామని ఇవ్వలేదు. భవిష్యత్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో కార్యకర్తే రాజు.. వాళ్లు చెప్పిందే జరుగుతుంది. ఇది జగన్ మాట. ఎమ్మెల్యే ఎన్నికలకు ఇంకా నాలుగేళ్లు ఉన్నాయి. గతంలో ఎన్నికలకు ఏడాది ముందు మాత్రమే టీడీపీ నాయకులు బయటకు వచ్చారు. కానీ మనం ప్రజల తరఫున ఇప్పటికే ఎన్నో కార్యక్రమాలు చేశాం. రాజకీయ పార్టీ గానీ, రాజకీయ నాయకులు, కార్యకర్తలు గానీ అధికారం కోసం మాత్రమే కాదు.. సమాజ అభ్యున్నతి కోసం పని చేయాలి. అన్ని వర్గాల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి లక్ష్యంగా మనం ఉండాలి. వైఎస్ జగన్ సీఎంగా ఉన్న సమయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళలకు ఏటా రూ.17500 ఇచ్చాం. గత ఎన్నికల సమయంలో 50 ఏళ్లు నిండిన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు రూ.4 వేలు పింఛన్ ఇస్తామని చెప్పినా చంద్రబాబు ఇవ్వలేదు. చంద్రబాబు మోసాల వల్ల ఎంత నష్టం జరిగిందో ప్రతి ఇంటికి వెళ్లి వివరించాలి. గ్రామ స్థాయిలోని ప్రతి నాయకుడు, కార్యకర్త, ప్రజాప్రతినిధులు 'రీకాలింగ్ చంద్రబాబు మేనిఫెస్టో' కార్యక్రమంలో పాల్గొనాలి. క్యూ ఆర్ కోడ్‌తో ప్రజలను చైతన్యవంతుల్ని చేయాలి. ఏడాదిలోనే కూటమి ప్రభుత్వం రూ.1.81 లక్షల కోట్లు అప్పు చేసింది. ఆ డబ్బులు ఎక్కడకు వెళ్లాయి? గతంలో వైఎస్ జగన్ నవర త్నాలతో పాటు అనేక సంక్షేమ పథకాలు అందించారు. ప్రతి పైసా ప్రజలకు పారదర్శకంగా చేరింది. చంద్రబాబు అధికారంలోకి వచ్చాక రైతుల పరిస్థితి దారుణంగా ఉంది. ప్రకృతి సహకరించడం లేదు. వర్షాలు కురవడం లేదు. కూటమి ప్రభుత్వం రైతులతో చెలగాటం ఆడుతోంది. గత ఏడాదికి సంబంధించి ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ ఇవ్వలేదు. పంటల బీమా ప్రీమియం 60 శాత మంది రైతులు కట్టలేదు. జగన్ హయాంలో ప్రభుత్వమే ఉచిత బీమా అందించింది. ఉమ్మడి అనంతపురం జిల్లాలో వైఎస్ హయాంలో 18 లక్షల ఎకరాల్లో పంటలు సాగు అయ్యేవి. ఆ తర్వాత క్రమంగా 13 లక్షల ఎకరాలకు తగ్గింది. కానీ ఇప్పుడు 48 వేల ఎకరాల్లో మాత్రమే విత్తనం వేశారు. పరిస్థితి దారుణంగా ఉన్నా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకోవడం లేదు, ప్రజాప్రతినిధులు ఇసుక, మట్టి, మద్యం అమ్ముకుందాం అనే రీతిలో ఉన్నారు. గత ఎన్నికల్లో 10 కోట్లు పెట్టాను? రూ.20 కోట్లు పెట్టాను అంటూ విచ్చలవిడిగా అవినీతికి పాల్పడుతున్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో ప్రత్యేక రాజ్యాంగాన్ని నడుపుతున్నారు. అధికారులను చెప్పుచేతుల్లో పెట్టు కుంటున్నారు. ప్రశ్నిస్తే రైలు పట్టాలపై పడుకోబెడతానని బెదిరిస్తున్న పరిస్థితి ఇక్కడుంది. ప్రజల కోసం ఎంతవరకైనా పోరాడదాం. మనలో అభిప్రాయ భేదాలు ఉంటే పక్కన పెట్టండి. గత ఎన్నికల్లో మన ఓడిపోయామంటే అందులో మన తప్పులూ ఉన్నాయి. మళ్లీ అలాంటివి పునరావృతం కాకూడదు. ఐకమత్యంతో వెళ్దాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాయ కత్వంలో ప్రజా ప్రభుత్వాన్ని నెలకొల్పుదాం. ఫిబ్రవరిలో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయి. ఇక ఆరు నెలలు మాత్రమే ఉంది. అందుకే వైసీపీ నాయకులు, కార్యకర్తలను భయభ్రాంతులకు గురి చేయాలని టీడీపీ కుట్ర చేస్తోంది. వాటిని గట్టిగా ఎదుర్కొందాం. ఇప్పటికే జగన్ చుట్టూ ఉన్న అధికారులు, నాయకులపై అక్రమ కేసులు పెడుతున్నారు. మాజీ మంత్రులను అరెస్ట్ చేస్తున్నారు. రాష్ట్రంలో చంద్రబాబు నియంత పాలన సాగిస్తున్నారు. ప్రజాస్వామ్య పద్ధతిలో మనమంతా ఎదుర్కొందాం. కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చినా మేం ముందుంటాం. సోషల్ మీడియాలో అందరూ యాక్టివ్‌గా ఉండాలి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు బహిర్గతం చేయాలి.



# బ్యాంకు అఫ్ బరోడా 118వ వ్యవస్థాపక దినోత్సవం

- మహతి కళాశాలలో వ్యాస రచన పోటీలు
- విజేతలకు ప్రోత్సాహక బహుమతులు
- కళాశాల చైర్మన్ డి. అమర్నాథ్ రెడ్డి

**మదనపల్లి –సూర్య వాస్తవం,జూలై 22 :** బ్యాంకు అఫ్ బరోడా 118వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని మదనపల్లి పట్టణం సి టి యం రోడ్డు నందు గల బ్యాంకు బ్రాంచ్ ఆధ్వర్యంలో మహతి కళాశాల లో విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించడం జరిగింది. మంగళవారం నిర్వహించిన వ్యాస రచన పోటీలో లేటెస్ట్ డెవలప్మెంట్ ఇన్ ఫార్మాసిటికల్ ప్రొడక్ట్స్ అనే అంశం పై జరిగిన వ్యాస రచన పోటిల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నేడు పోటీ ప్రపంచం లో సాంకేతిక పరిజ్ఞానం ద్వారా విద్యార్థులకు ఫార్మసిటికల్స్



పై సంపూర్ణ అవగాహన ను పెంపొందించడం కోసం వ్యాసరచన పోటీలు బ్యాంకు అఫ్ బరోడా వారి సహకారం తో నిర్వహించడం జరిగిందని కళాశాల చైర్మన్ అమర్నాథ్ రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్ రెడ్డి లు పేర్కొన్నారు. సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా విద్యార్థులు ఎంచుకున్న రంగంలో రాణించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయని పేర్కొన్నారు. అదే విధంగా బ్యాంకు అఫ్ బరోడా మదనపల్లి బ్రాంచ్ మేనేజర్ మహేంద్ర పర్యవేక్షణ లో జరిగిన బ్యాంకు వ్యవస్థాపక దినోత్సవ కార్యక్రమం లో భాగంగా నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో పదిమంది విజేతలకు ప్రోత్సాహక బహుమతులు ప్రధానం చేశారు. తాము ఆర్థిక లావాదేవీలకే పరిమితం కాకుండా సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ తమ వంతు పాత్రను పోషిస్తున్నామని చెప్పారు. ఇందులో విద్యార్థుల ను భాగస్వాములు చేసి ప్రోత్సహించడమే తమ ప్రధాన ఉద్దేశం అన్నారు. ఈ కార్యక్రమం లో సెక్రటరీ శ్రీ వాణి, కోటిరెడ్డి, కళాశాల సిబ్బంది, బ్యాంకు ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.





## అ "పూర్వ" విద్యార్థుల ఆత్మీయ కలయిక

**శాంతిపురం –సూర్య వాస్తవం ,జూలై 22 :**

చిన్ననాడు కలసి చదువుకుని పదవతరగతి తరువాత విడిపోయి సుమారు 30 సంవత్సరాల తరువాత అందరూ ఒక చోట కలసిన చిన్ననాటి మిత్రుల అపూర్వ కలయిక మంగళవారం మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే 1995–96 విద్యాసంవత్సరంలో శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పదవతరగతి చదువుకున్న విద్యార్థులు పరీక్షల అనంతరం పలువురు ఉన్నత విద్యకు, మరికొంత మంది విద్య మానేసినవారు,మరికొంతమంది ఇతర వృత్తులలో స్థిరపడి ఒకరికొకరు దూరమయ్యారు.

సుమారు 30 సంవత్సరాల తరువాత మంగళవారం మండల పరిధిలోని వరదేపల్లె వద్దనున్న శ్రీ ఇరుగులమ్మ దేవాలయం వద్ద సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా చిన్ననాటి జ్ఞాపకాలు,బాల్యంలో చేసిన చిలిపి చేష్టలు నెమరు వేసుకున్నారు. తమ తో పాటు విద్యనభ్యసించి మృతి చెందిన మిత్రుల కుటుంబాలకు బాసటగా నిలవాలని తీర్మానించుకున్నారు. అలాగే తమ మిత్ర బృందం తరపున పలు సామాజిక సేవా కార్యక్రమాలను నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల సమ్మె ఆగస్టు 3 వరకు తాత్కాలిక వాయిదా

**అన్నమయ్య బ్యూరో –సూర్య వాస్తవం, జూలై 22:** మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ. రామాంజులు, మున్సిపల్ యూనియన్ జిల్లా అధ్యక్షులు బీవీ రమణ ఇంజినీరింగ్ కార్మికుల సంఘం అధ్యక్షులు కార్యదర్శి అక్బర్ శంకరయ్యలు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట 10 రోజు సమ్మె సందర్బంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం కార్మికుల మనోభావాలకు నుగుణంగా జీతాలు అరకొర పెంచి124 జీ ఓ విడుదల చేసినప్పటికీ వేతనాలు ఇప్పటి నుండి పెంచుతున్నారో వివరాలు జి ఓ లో లేనందున మరియు సంక్షేమ పథకాలు ఊసే పేర్కొనలేదని , మున్సిపల్ రాష్ట్ర ముఖ్య అధికారులు ఆగస్టు 3 వరకు అందుబాటులో లేనందున సమ్మెను ఆగష్టు 3 లోపల వేతనాలు పెంపు లో స్పష్టత, ఇతర డిమాండ్ల అమలు జరగకపోతే మళ్ళీ నిరవధిక సమ్మె కొనసాగిస్తామని అప్పటివరకు సమ్మె ను తాత్కాలిక వాయిదా వేస్తున్నట్లు సీఐటీయూ రాష్ట్ర కమిటి తెలిపిందన్నారు. కార్మికులు ఐక్య సంఘటన వలనే ప్రభుత్వం జీవో 124 విడుదల చేసిందని మానవహారంతో ముగించారు రేపు ఉదయం 5 గంటలకు విధులకు హాజరువుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమం లో మున్సిపల్ ఇంజినీరింగ్, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.



### తోతాపురి మామిడి రైతుల ఆందోళన...

# మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కిమ్ ఏపీకి వర్తింపు పట్ల హర్షం

- ఆలస్యంగానైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం పట్ల తోతాపురి మామిడి రైతుల్లో వెల్లువెత్తిన ఆనందం
- మామిడి చెట్ల పైనే మాగి పండ్లు రాలి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలి
- రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి





**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 22:** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తోతాపురి మామిడి రైతుల ఆందోళన పలితంగా మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కిమ్‌ను ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి కూడా వర్తింప చేయడం పట్ల రాయచోటి మండల లీగల్ సర్వీసెస్ కమిటీ మాజీ సభ్యులు యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి మంగళవారం ఒక ప్రకటన ద్వారా హర్షం వ్యక్తం చేశారు.రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ, వైయస్సార్ కాంగ్రెసు పార్టీ, కమ్యూనిస్టు పార్టీలు, ప్రింట్ మీడియా, ఎలక్ట్రానిక్ మీడియా, సోషియల్ మీడియాలు రైతుల గోడు పట్టించుకోమని ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్ళినందులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.అలాగే ఆలస్యంగా నైన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించడం పట్ల తోతాపురి మామిడి రైతుల్లో అనందం వెల్లువెత్తిందని, అయితే ప్రక్కనే ఉన్న కర్నాటక రాష్ట్రంతో పాటు 2.5 లక్షల మెట్రిక్ టన్నుల కాయలకు క్వింటాల్ రూ 1616 లకు సమానంగా కాకుండా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ప్రభుత్వం లెక్కల ప్రకారం తోతాపురి మామిడి కాయల దిగుబడి 6.5 లక్షల మెట్రిక్ టన్నుల కాగా కేవలం 1.62 మెట్రిక్ టన్నుల కాయలకు మాత్రమే రూ 1490.70 లు చోప్పున నిర్ణయించి వివక్ష చూపడం పట్ల రైతులు విచారం వ్యక్తం చేస్తున్నారని ఆయన తెలిపారు.తోతాపురి మామిడి కాయల ధరలు పతనం నేపథ్యంలో చెట్ల పైనే మాగి పండ్లు రాలి నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు.ఆంధ్రా తోతాపురి మామిడి రైతులకు పెద్ద ఉపశమనం లభించిందని,2025-26 సంవత్సరానికి యమ్ఐయస్ కింద ధరల లోపం చెల్లింపు ( పీడీపీ)ను కేంద్రం ఆమోదించందని,. కేంద్రం నిర్ణయంతో ఏపీలో 1.62 లక్షల మెట్రిక్ టన్నుల మామిడి కొనుగోలుకు అవకాశం లభించినట్లైందని, మామిడి రైతులకు క్వింటాల్‌కు రూ. 1,490.73లు చెల్లించనున్నారన్న వార్త రైతులకు అనందాన్ని నింపిందని ఆయన తెలిపారు. అలాగే 50:50 నిష్పత్తితో కేంద్రం, ఏపీ ప్రభుత్వం ఈ మద్దతు ధర చెల్లించనున్నాయని వార్త కథనం ద్వారా తెలియడంతో దేశ ప్రధాని నరేంద్ర మోదీ, వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, వ్యవసాయ శాఖ మంత్రి వర్యులు కింజరాపు అచ్చం నాయుడులకు కృతజ్ఞతలు, ధన్య వాదాలు ఆయన తెలియ జేశారు.

అలాగే ప్రతిపక్ష పార్టీ నాయకులు వైయస్సార్ సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి బంగారుపాళెం వ్యవసాయ మార్కెట్ యార్డును సందర్శించి రైతుల పక్షాన నిలబడి వాణి వినిపించి నందుకు కృతజ్ఞతలు, అభినందనలు తెలియ జేశారు.ఆదే విధంగా ఏదో ఒక పద్దతిలో రైతుల గోడును వినిపించన కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన ఆధికార ప్రతినిధి డాక్టర్ యన్.తులసి రెడ్డి, భారత కమ్యూనిస్ట్ పార్టీ (సిపిఐ) జాతీయ ప్రధాన కార్యదర్శి నారాయణ తదితరులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఈ చర్యల వల్ల ధరల పతనాల నుండి రైతులను కాపాడటానికి అవకాశం లభించిందని, ఈ చర్య న్యాయమైన రాబడిని నిర్ధారి చండంతో పాటూ గ్రామీణ జీవనోపాధిని బలోపేతం చేస్తుందని కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్ర శేఖర్ తెలిపినట్లు నిజమేనని ఆయన తెలిపారు. మామిడి రైతులను ఆదుకోవడానికి సీఎం నారా చంద్రబాబు నాయుడు ఇప్పటికే చర్యలు తీసుకున్న విషయం తెలిసిందేనని, చంద్రబాబు చొరవతో చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో తోతాపురి మామిడి రైతులకు మద్దతుగా ట్రేడర్లు ముందు కొచ్చారని కేంద్ర మంత్రి చెప్పినట్టు నిజం కాదని, రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించినట్లు కిలో రూ 8 -00 లు ఏ రైతుకు,ఏ జ్యూస్ ఫ్యాక్టరీ యాజమాన్యం కోనుగోలు చేయలేదని విశ్వనాథరెడ్డి తెలిపారు.అదే విధంగా పలు ప్రాసెసింగ్ యూనిట్లు యాజమాన్యాలు సిండికేట్ ఏర్పడి 2,3,4 రూపాయలకు మించి ధరతో కొనుగోలు చేయలేదని విశ్వనాథరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

జ్యూస్ ఫ్యాక్టరీలు కూడా రైతులను ఆదుకునేందుకు చర్యలు తీసుకున్నాయనే కేంద్ర మంత్రికి అందిన సమాచారం పూర్తి అవాస్త వమైనదని ఆయన వివరించారు.తాజాగా కేంద్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయంతో రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ కానుందనే సమా చారంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని, సీఎం చంద్రబాబు నాయుడు కి,మన రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి వర్యులు పెమ్మసాని చంద్రశేఖర్ కి, మరియు కేంద్ర ప్రభుత్వానికి ఆయన ప్రత్యేకత కృతజ్ఞతలు తెలియ జేస్తున్నాట్లు ఆ ప్రకటన ద్వారా తెలిపారు.అలాగే జ్యూస్ ఫ్యాక్టరీల, మరియు మామిడి మండిల యాజమాన్యాలు సిండికేట్‌గా ఏర్పడిన దుష్టశక్తులు చేసే కుట్రల పట్ల ప్రభుత్వాలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, మామిడి ధరలు కృత్రిమ పతనం సంక్షోభం నుంచి కాపాడి, రైతుల సంక్షేమం కోసం కృషి చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సిరికల్చర్ పై రైతులకు అవగాహన సదస్సు




**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 22:**

అన్నమయ్య జిల్లా రాయచోటి సిరికల్చర్ కార్యాలయంలో మంగళవారం డీఎస్ఓ వాణి మేడం సెరికల్చర్ పై అవగాహన సదస్సు ఏర్పాటు చేయడం జరిగింది. ఈ అవగాహన సదస్సులో మేడమ్ ఈ సిరికల్చర్ రైతాంగాన్ని గురించి చక్కగా వివరించడం జరిగింది. ఏ టైములో ఏమి చేయాలా అనే అవగాహనతో రైతులకు వివరంగా తెలియజేశారు మేడం స్టాప్ అందరు కూడా ఈ అవగాహన సదస్సు రైతులతో చక్కగా వివరించారు ఈ అవగాహన సదస్సులో పాల్గొన్నటువంటి ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వంగిమళ్ళ రంగారెడ్డి రైతులతో ముఖాముఖి సమావేశం చేశారు.

ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతు ఉన్నటువంటి విస్తీర్ణములో ఎంత విస్తీర్ణం ఉంటే అంతా ఒకే ఫలం పెట్టడం కరెక్ట్ కాదు ఒక ఐదు ఎకరాలు ఉన్నది దాంట్లో ఆర్టికల్చర్ గాని అగ్రికల్చర్ గాని మనకు ఏ విధంగా దిగుబడి వస్తుందనే పంట ఆలోచించి ప్రయత్నం చేస్తే బాగుంటుంది అయినా పాడి అంటే రైతు రైతంటే పాడి అనే విధంగా పాడిపంట అన్ని ఉంటే కూడా ఇప్పుడు ఉండబడినటువంటి టయాలలో రైతు నష్టపోకుండా రైతు కుటుంబం ఇబ్బందులు పడకుండా ఉండాలంటే అన్ని ఆలోచన ప్రకారం రైతు చేసుకుంటే బాగుంటుందని మనము ఏదో ఒక పంట పెట్టి ఒకేసారి సంపాదించేద్దాం అనుకుంటే ఇప్పుడు ఉండవట్టినటువంటి కరువులతో అకాల వర్షాలతో పెట్టిన పంటలు చేతికి రాక ఇబ్బందులు పడకుండా రైతు బాగుపడాలంటే ఆలోచించాలి అందుకని రైతులందరము కూడా ఒక యూనియన్ గా అంతా గ్రూపులై మన రైతు సమస్యల పైన మనము మన హక్కులు సాధించుకోవాలంటే కలిసికట్టుగా ఐక్యతగా కలిసిమెలిసి ఉంటే బాగుంటుందని ఈ సమావేశంలో ఆయన తెలియజేస్తూ వివరించారు. అనంతరం అగ్రికల్చర్ డీఎస్ఓ వాణి ని బుక్కే శాలువాలతో సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాయచోటి ఏరియా అధ్యక్షులు హరినాథ్ నాయుడు రైతులు అగ్రికల్చర్ స్టాప్ అందరు కూడా పాల్గొని సదస్సును విజయవంతం చేయడం జరిగింది.

# ఏపీ అభివృద్ధి సీఎం చంద్రబాబుతోనే సాధ్యం

- ఇది మంచి ప్రభుత్వం అని మద్దతు తెలిపిన స్థానికులు
- కూటమి పాలనతో తాము సంతృప్తిగా, ప్రశాంతంగా ఉన్నామని ప్రజల వెల్లడి
- రాష్ట్ర మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి





**రాయచోటి/సూర్య వాస్తవం, జూలై 22:**

రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న 'సుపరిపాలనలో తొలి అడుగు' కార్యక్ర మంలో భాగంగా గాజువాకలోని 70వ వార్డులో రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్ తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా వారు ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వానికి సంబంధించిన అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్రజల నుండి ప్రభుత్వంపై మద్దతు, సంతృప్తి స్పష్టంగా కనిపించింది. స్థానికులు కూటమి పాలనతో తాము సంతృప్తిగా ఉన్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ చిరంజీవి, జీవీఎంసీ మేయర్ పీలా శ్రీనివాస్, స్థానిక కార్పొరేటర్లు ప్రజాప్రతినిధులు, నాయకులు పార్టీ కార్యకర్తలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. వేలాదిగా కార్యకర్తలు క్షేత్రస్థాయిలో నడుచుతూ ప్రజలతో మమేకమయ్యారని మంగళవారం మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి క్యాంప్ సిబ్బంది ఒక ప్రకటనలు తెలిపారు.

# పాఠశాల విద్యాశాఖలో పరిశోధనలే కీలకం

- ఆధారాలు లేని పరిశోధనలకు అర్థం లేదు
- విద్యలో వినూత్న పద్ధతులను గుర్తించి నమోదు చేయలి
- ప్రాంతీయ విద్యాసంస్థ లో జరిగిన సంప్రదింపుల సమావేశంలో ప్రొఫెసర్ బి రమేష్ బాబు వెల్లడి





**- అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 22:** పాఠశాల విద్యా శాఖలో పరిశోధనలే కీలకమని, ఈ పరిశోధనలను సమాచారంతో కాకుండా ఖచ్చితమైన ఆధారాలతో నిర్వహించాలని ప్రొఫెసర్ బి.రమేష్ బాబు అన్నారు. మంగళవారం ఉదయం నెల్లూరు పట్టణంలోని ప్రాంతీయ విద్యా సంస్థనందు పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఏర్పాటు చేసిన సంప్రదింపుల సమావేశం ప్రారంభం సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యమైన విద్య కోసం సమగ్ర శిక్ష కింద అనేక కార్యక్రమాలను పాఠశాలల్లో అమలు చేయడం జరుగుతూఉందన్నారు. ఈ కార్యక్రమాల అమలు, నాణ్యత, ప్రభావాలపై విద్యాశాఖ అధికారులు పరిశోధనా కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలన్నారు. వాటి ఫలితాలు ప్రజలందరికీ తెలిసేలా జాతీయ, అంత ర్జాతీయ పత్రికలలో ప్రచురితమయ్యేల చూడాలన్నారు. నూతన విద్యా విధానం 2020 లోని అంశాలు, వాటి ప్రాధాన్యత గురించి విపులంగా వివరించారు. అనంతరం ఈ కార్యక్రమానికి హాజరైన మరొక ముఖ్యఅతిథి ప్రొఫెసర్ జి విశ్వనాథప్ప మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ వెబ్ పోర్టల్ యస్ ఈ షగన్ ఆధారంగా ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ విద్యావేత్తలు అవలంబించిన వినూత్న పద్ధతులను గుర్తించి వాటిని డాక్యుమెంట్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం లక్ష్మీనరసింహ, ప్రొఫెసర్ బి భర్తకుర్, ప్రొఫెసర్ కన్నన్, మాజీ డీఈవో నరసింహారెడ్డి, ఎస్సీఈఆర్టీ అధికారులు, సమగ్ర శిక్ష అధికారులు, డైట్ అధ్యాపకులు, ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.


# రాయలసీమను సస్య శ్యామలం చేసే దిశగా సీఎం ప్రత్యేక శ్రద్ధ

- నాలుగు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే విధంగా హెచ్ ఎన్ ఎస్ ఎస్
- జగన్ రెడ్డి ఐదేళ్ల పాలన లో రాయలసీమ బిడ్డని అని చెప్పుకొని సీమ కే అన్యాయం చేశారు
- కూటమి ప్రభుత్వం ఏడాది లోనే హంద్రీనీవా ఫేజ్1, ఫేజ్ 2 కి రూ.3873 కోట్లు ఖర్చు
- రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి



**రాయచోటి-సూర్య వాస్తవం,జూలై 22:** రాయలసీమ ను సస్య శ్యామలం చేసే దిశ గా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారని రాయచోటి నియోజకవర్గ టిడిపి నాయకులు డాక్టర్ మండిపల్లి లక్ష్మీప్రసాద్ రెడ్డి అన్నారు.మంగళవారం రాయచోటి తెలుగు దేశం పార్టీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ..హంద్రీనీవా సుజల స్రవంతి ప్రాజెక్ట్ ను 1996 మార్చి 11 న ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంబి ంచారన్నారు. రాయలసీమను సస్యశ్యామలం చేసే విధంగా నాలుగు జిల్లాల రైతాంగానికి ఉపయోగపడే విధంగా ఈ ప్రాజెక్ట్ ను ఫేజ్ 1, ఫేజ్ 2 గా రూపొంది అని ఆయన అన్నారు.

# వచ్చే నెల నుంచి ఒంటిమిట్టలో మూడుపూటల అన్నప్రసాదం



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం ,జూలై 22:**వచ్చే నెల నుంచి ఒంటిమిట్టలో మూడుపూటల అన్నప్రసాదం ఆంధ్రప్రదేశ్ : భక్తులకు శుభవార్త. తిరుమలలో అన్ని కార్యాలయాలు ఒకే చోట ఉండేలా పరిపాలన భవనం నిర్మించాలని టీటీడీ నిర్ణయించింది. మంగళవారం జరిగిన పాలకమండలి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను ఆలయ ఈవో శ్యామలరావు మీడియాకు తెలిపారు. 700 మంది వేదపారాయణ దారులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆగస్టు నెల నుంచి మూడు పూటలు ఒంటిమిట్టలోని కోదాండరామాలయంలో భక్తులకు అన్నప్రసాద వితరణ చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు.

## నిధుల దుర్వినియోగంపై అధికారుల విచారణ



**వీరబల్లి- సూర్య వాస్తవం, జూలై 22:** వీరబల్లి మండలంలోని సానిపాయి గ్రామ పంచాయతీ నిధుల దుర్వినియోగంపై గతంలో విచారణ చేసి అధికారులు నివేదికలు ఇవ్వడం జరిగింది. ఆ నివేదికలో ఉన్న పలు అభ్యంతరాలపై పలుసార్లు కలెక్టర్ ని కలిసి సీఎంఓ ఆఫీస్ లోను,పంచాయతీరాజ్ కమిషనర్ కి స్థానిక తెలుగు దేశం నాయికలు నేతి రమేష్ ,నేతి రాంమోహన్ ఫిర్యాదు చేయడం జరిగింది. ఈ ఫిర్యాదు పై మదనపల్లె డివిజన్ డిఎల్పిఓ నాగరాజుని, మండల తాసిల్దార్ ఖాజాబీ మేడంని వీరబల్లి మండల ఎంపీడీవో జవహర్ బాబుని విచారణ చేయమని విచారణ అధికారులుగా కలెక్టర్ నియమించడం జరిగింది. ఈరోజు విచారణ అధికారులైన డి ఎల్ పి ఓ నాగరాజు వీరబల్లి తాసిల్దార్ ఖాజాబీ మేడం మరియు మండల ఎంపీడీవో జోహార్ బాబు రామచంద్రారెడ్డి పూర్వపు పంచాయతీ కార్యదర్శి బాలస్వామి, రాజశేఖర్ రెడ్డి, లంకా చంద్రుడు, రెహమాన్ సమక్షంలో రికార్డులను తనిఖీ చేయడం జరిగింది తనిఖీ నివేదికలను రెండు రోజుల్లో కలెక్టర్ కి విచారణ నివేదికలు ఇస్తామని డి ఎల్ పి ఓ నాగరాజు తెలియజేశారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా వీరబల్లి ఎస్ఐ నరసింహారెడ్డి , వారి సిబ్బందితో హాజరై ప్రశాంత వాతావరణంలో విచారణ పూర్తి జరిగింది.

## బి.టెక్ ద్వితీయ సెమిస్టర్ పరీక్ష ఫలితాల విడుదల




**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 22:** కుప్పం మండలంలో స్వతంత్ర ప్రతిపత్తి కలిగి నడపబడుతున్న కుప్పం ఇంజనీరింగ్ కళాశాల ద్వితీయ సెమిస్టర్ ఫలితాలను ఆ సంస్థ యాజమాన్యం మంగళవారం విడుదల చేశారు. బిసిఎన్ సంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు, జవహర్ లాల్ నెహ్రూ సాంకేతికవిశ్వవిద్యాలయం పరీక్షల పరిశీలకులు ఆచార్య విబి చిత్రలు పరీక్ష ఫలితాలను విడుదల చేశారు. అనంతరం బిసిఎన్ విద్యాసంస్థల వ్యవస్థాపక అధ్యక్షులు బిసి నాగరాజు మాట్లాడుతూ ద్వితీయ సెమిస్టర్ పరీక్ష ఫలితాలలో కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పరీక్షా ఫలితాల ప్రకారం బ్రాహ్మణి 94.6 శాతం, కసిరెడ్డి రక్షిత 93.8 శాతం, కొట్టే వాగ్దేవి 92.9 శాతం మార్కులు సాధించి, ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలలో నిలిచినట్లు తెలిపారు. కళాశాల వనరులను వినియోగించుకుని విద్యార్థులందరూ మంచి విద్యను అభ్యసించి, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని విద్యార్థులకు సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ -చైర్మన్ డా సునీల్ రాజ్, కార్యదర్శి సాగర్ రాజ్, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర బాబు, వైస్-ప్రిన్సిపాల్ డాక్టర్ భాస్కరన్, హ్యుమానిటీస్ అండ్ సైన్సస్ విభాగాధిపతి జె. మాధవన్, కళాశాల కంట్రోలర్ అఫ్ ఎక్సమినేషన్స్ సోమసుందరం, విభాగాధిపతులు పాల్గొన్నారు.

## పేదలకు ఇచ్చిన బియ్యం.. దళారుల వరంగా మారింది!

**- రేషన్ బియ్యం పట్టపగలే ఆటోల్లో తరలింపు - పట్టించుకోని అధికారులు**

**- అక్రమ రవాణా ముఠాలకు కేంద్రంగా మారిన మండలం.**

**- రావులపాడు గ్రామం నుంచి బహిరంగంగా తరలింపు**

**- నిశ్శబ్దంగా ఉన్న సంబంధిత శాఖలు**

**- విజిలెన్స్, రెవెన్యూ, పోలీస్ శాఖల నిర్లక్ష్యంపై మండల ప్రజల ఆగ్రహం**

**పెళ్లకూరు -సూర్య వాస్తవం, జూలై 22:** ప్రభుత్వం నిరుపేదలకు అందిస్తున్న రేషన్ బియ్యం అక్రమ రవాణా దారులకు వరంగా మారింది. తిరుపతి జిల్లా, పెళ్లకూరు మండలంలోని పలు గ్రామాల నుండి సేకరించిన రేషన్ బియ్యం అక్రమ వ్యాపారస్తులు పొరుగు రాష్ట్రాలకు తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తంతు గత మూడేళ్లుగా కొనసాగుతోంది. సూళ్లూరుపేటకు చెందిన ఓ అక్రమ వ్యాపారి మండలంలోని పలు గ్రామాల్లో దళారులను ఏర్పాటు చేసుకొని, వారి ద్వారా బియ్యం పేదల నుండి సేకరించి ఆటోల్లో తరలిస్తున్నారు. రావులపాడు గ్రామం నుండి పట్టపగలే రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. అక్రమ వ్యాపారం సజావుగా సాగడానికి ప్రభుత్వపరంగా పలు శాఖ అధికారులు కూడా చూసి చూడనట్లు వ్యవహరించడంతో యదేచ్చగా పెళ్ళకూరు మండలం నుండి ప్రభుత్వ రేషన్ బియ్యం తరలిపోతోంది. ఇలాంటి అక్రమ వ్యాపారాలపై ఉక్కు పాదం మోపి కట్టడి చేయాల్సిన పోలీస్, రెవెన్యూ, విజిలెన్స్. ఎన్ఫోర్స్మెంట్ అధికారులు ఎందుకు పట్టించుకోవటం లేదు. అని పలు విమర్శలు ఉన్నాయి. ఇలాంటి ప్రభుత్వ వ్యతిరేక అక్రమ వ్యాపారాలను కట్టడి చేస్తూ, సూత్రధారులను పట్టుకొని వారిపై చర్యలు చేపట్టాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని మండల ప్రజల అభిప్రాయం పడుతున్నారు.



## మాదకద్రవ్యాల నిర్మూలనలో
# వైద్య, విద్యశాఖల పాత్ర కీలకం

**- జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు**

**-ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోంది:ఏఎస్పి వెంకటాద్రి**

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 22:** మాదకద్రవ్యాల నిర్మూలనలో వైద్య మరియు విద్య శాఖల పాత్ర కీలకమని జిల్లా రెవెన్యూ అధికారి మధుసూదనరావు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో రాయచోటి ఏ ఎస్ పి వెంకటాద్రితో కలిసి రెవెన్యూ, విద్య, వైద్య, ఎక్సైజ్, తదితర అధికారులతో జిల్లాస్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ మాదకద్రవ్యాలు సమాజానికి చీడపురుగువంటివని వీటిని వాడకాన్ని సమూలంగా నివారిస్తేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందన్నారు. పోలీస్ రెవెన్యూ ఎక్సైజ్ వైద్య విద్య తదితర శాఖల సమన్వయంతోనే మాదకద్రవ్యాలను నిర్మూ లించవచ్చన్నారు. కఠిన చర్యలు లేకుంటే దీనిని అరికట్టడం సాధ్యం కాదని రాయచోటి ఏ ఎస్ పి కి సూచించారు. జిల్లాలో మాదకద్రవ్యాల నిరోధకానికి వైద్య శాఖ చేపట్టిన కార్యక్రమాల మీద ఒక పవర్ పాయింట్ ప్రజెంటేషన్ తయారు చేసి చూపించాలని అన్ని శాఖల అధికారులను ఆదేశించారు. మాదకద్రవ్యాల వాడకానికి వ్యసనపరులైన వారు ముందుగా వైద్యుల దగ్గరికి




వస్తారని, అటువంటి వారి సమాచారాన్ని సేకరించాలని ఆదేశించారు. జిల్లాలో వాడుతున్న మాదకద్రవ్యాలు ఏవి, అవి ఎక్కడ అమ్ముతున్నారో జిల్లా వ్యాప్తంగా తనిఖీ నిర్వహించి తెలుసుకోవాలని జిల్లా డ్రగ్స్ అధికారిని ఆదేశించారు. జిల్లాలో ప్రతి ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పాలిటెక్నిక్ తదితర కళాశాలలో తప్పనిసరిగా మాదకద్రవ్యాల నిర్మూలన కమిటీలు ఏర్పాటు చేయాలని, వాటి పనితీరును ప్రతి నెల పర్యవేక్షించాలని జిల్లా విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. రాయచోటి ఏ ఎస్ పి మాట్లాడుతూ గౌరవ విద్యాశాఖ మంత్రివర్యుల ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న ఆపరేషన్ సేఫ్ క్యాంపస్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలు కళాశాలల చుట్టూ 100 మీటర్ల దూరం వరకు సిగరెట్లు గంజాయి వంటి మాదకద్రవ్యాలను అమ్మితే కఠిన చర్యలు తీసుకునే విధంగా ఆదేశాలు ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఈగల్ క్లబ్స్ ఏర్పాటు ద్వారా డ్రగ్స్ నియంత్రణకు చాలా చర్యలు చేపట్టిందన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనకు అన్ని కోణాలలో చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. పోలీస్ శాఖ, రెవెన్యూ శాఖ, అటవీశాఖ, వైద్య, విద్య, ఏపీ ఎస్ ఆర్టీసీ తదితర అన్ని శాఖల సమన్వయంతోనే మాదకద్రవ్యాల నిర్మూలన సాధ్యమవుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం రవాణా తదితర అంశాలపై సమాచారం ఇచ్చేందుకు 14500, 7382296118 టోల్ ఫ్రీ నెంబర్లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ నెంబర్లకు సమాచారం ఇచ్చిన వారి వివరాలను ఎవరికి చెప్పమని, నిర్భయంగా మాదకద్రవ్యాల వాడకం రవాణా తదితర అంశాలపై సమాచారాన్ని ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా ఎక్సైజ్ అధికారి మధుసూదన్ మాట్లాడుతూ పోలీస్ శాఖ మరియు ఈగల్ వ్యవస్థలతో సమన్వయం చేసుకొని మాదకద్రవ్యాలు అమ్ముతున్న ప్రదేశాలలో ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహిస్తున్నామని రెండవ మరియు నాలుగవ శనివారాలలో పాఠశాలలు మరియు కళాశాలలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో రెవెన్యూ, పోలీస్, విద్య, వైద్య తదితర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




## ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ధైర్యంగా ఎదుర్కొందాం

**- రమేష్ రెడ్డిని పరామర్శించిన శ్రీకాంత్ రెడ్డి,**

**ఆకేపాటి అమర్నాథరెడ్డి , సురేష్ బాబు , సుగువాసి బాలసుబ్రమణ్యం లు**

**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం ,జూలై 22:** ఎన్ని అక్రమ కేసులు పెట్టినా కలిసికట్టుగా, ధైర్యంగా ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉన్నామని , వైయస్సార్సీపి పార్టీ నాయ కులకు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటు ందని ఎవరూ అధైర్య పడాల్సిన అవసరం లేదని వైఎస్ఆర్సిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి,అన్నమయ్య జిల్లా వైఎస్ఆర్సిపి అధ్యక్షులు, రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి , కడప మేయర్ సురేష్ బాబు, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్, వైఎస్ఆర్సిపి నాయకులు సుగవాసి బాలసుబ్రమణ్యం లు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని రమేష్ కుమార్ రెడ్డి నివాసంలో రమేష్ కుమార్ రెడ్డిని పరామర్శించి అక్రమ కేసులపై ధైర్యంగా ఎదుర్కొందామని తెలియ జేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిపక్ష పార్టీ గొంతు నొక్కే ప్రయత్నం కూటమి ప్రభుత్వం చేస్తో ందని , ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి భయ భ్రాంతులకు గురిచేయాలని ప్రయత్నిస్తోందని , ప్రజల పక్షాన నిలబడడానికి ఎన్ని కేసులైన పెట్టించుకోవడానికి తాము సిద్ధంగా ఉన్నామని , ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చే వరకు కూటమి ప్రభుత్వంపై పోరాటం ఆగదని వారు హెచ్చరించారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటు అయ్యి ఏడాది పూర్తి అయినా సూపర్ సిక్స్ హామీలను అమలు చేయకుండా ప్రజల దృష్టిని మళ్ళించడానికి రాష్ట్రంలో వైఎస్ఆర్సిపి నాయకులు పైన ,కార్యకర్తల పైన, సోషల్ మీడియా కార్యకర్తల పైన అక్రమ కేసులు పెడుతూ దాడులకు పాల్పడుతున్నారనీ అన్నారు. రాష్ట్రంలో ప్రజా





పరిపాలన మరిచి రెడ్ బుక్ రాజ్యాంగం నడు స్తోందనీ , ప్రజల అన్ని గమనిస్తూనే ఉన్నారని కూటమి ప్రభుత్వానికి బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, ఉమ్మడి జిల్లాల వ్యవసాయ శాఖ సలహా మండలి మాజీ చైర్మన్ సంబటూరు ప్రసాద్ రెడ్డి, పంచాయితీ రాజ్ వింగ్ స్టేట్ సెక్రటరీ గాలివిటీ వీరనాగిరెడ్డి, రాజంపేట అసెంబ్లీ పబ్లిసిటీ వింగ్ మాదిరెడ్డి సత్యనారాయణరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కాలాడి ప్రభాకర్ రెడ్డి,మాన్యం సంతోష్ రెడ్డి, పురుషోత్తం రెడ్డి,మాజీ ఎంపీపీ లు అంబా బత్తిన రెడ్డయ్య, తిమ్మిరెడ్డి ఉమాపతి రెడ్డి, ఉప మండల అధ్యక్షులు సమరసింహారెడ్డి, లు రమేష్ కుమార్ రెడ్డిని కలిసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో నియోజక వర్గంలోని రామపురం, లక్కిరెడ్డి పల్లె ,గాలివీడు ,సంబేపల్లి, చిన్నమండెం, రాయచోటి మండలాలకు చెందిన పలువురు సర్పంచులు ,ఎంపీటీసీ సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు ,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

## మైనార్టీ సంక్షేమ నిధుల విడుదలకు
# మంత్రులకు ఫరూక్ షిబ్లీ వినతి

**- రాష్ట్ర ముస్లిం మైనార్టీ పరిరక్షణ సమితి అధ్యక్షుడు ఫారుక్ షిబ్లీ**

**రాయచోటి - సూర్య వాస్తవం, జూలై 22:** ఆంధ్రప్రదేశ్ మైనార్టీల సంక్షేమానికి సంబంధించిన వివిధ పథకాల అమలుకు అవసరమైన నిధులను (పి ఎం జె వి కే వై, పీఎం వికాస్, ఎన్ ఎం ఎఫ్ డీ సీ) వెంటనే విడుదల చేయాలని కోరుతూ మంగళవారం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షులు ఫరూక్ షిబ్లి ఏపీ మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ గతంలో వినతి పత్రం సమర్పించి న విషయం అందరూ తెలిసిందే. ఢిల్లీలోని కేంద్ర మైనార్టీ సంక్షేమ మంత్రి కిరణ్ రిజిజును కలిసి అభ్యర్థిస్తూ వినతిపత్రం సమర్పించారు. అలాగే గన్నవరం విమానాశ్రయాన్ని హజ్ ఎంబార్గేషన్ పాయింట్ గా తిరిగి నియమించాలని, అలాగే తెలంగాణ, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలతో సరి సమానంగా హజ్ యాత్ర



ఖర్చు ఆంధ్ర రాష్ట్రానికి కూడా అలాగే ఉండే విధంగా ఉత్తర్వులు జారీ చేయవలసిందిగా ఆయన కోరారు. ఇందులో భాగంగా కేంద్ర మంత్రి రామ్ మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, టీడీపీ పార్లమెంట్ అధ్యక్షులు లావు కృష్ణ దేవరాయలు, నంద్యాల పార్లిమెంట్ సభ్యురాలు బైరెడ్డి శబరి, ఏపీ కూటమి భాగస్వామి అయిన బిజెపి రాష్ట్ర అధ్యక్షులు మాధవ్, మాజీ బీజేపీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి, ఏపీ మైనారిటీ మోర్చా రాష్ట్ర అధ్యక్షులు షేక్ బాజీ లను కలిసి మైనార్టీ సంక్షేమ నిధుల విడుదల కోసం కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు ప్రత్యేకంగా సిఫార్సు చేయమని కోరడం జరిగింది. ఈ విషయంలో వారు సానుకూలంగా స్పందించి సహకరిస్తామని హామీ ఇవ్వడం జరిగిందని రాష్ట్ర ముస్లిం మైనార్టీ హక్కుల పరిరక్షణ సమితి అధ్యక్షుడు షారుక్ షిబ్లీ ఒక ప్రకటనలు తెలిపారు. ఈ సందర్భంగా సహకరించిన పెద్దలందరికీ షిబ్లి మనస్ఫూర్తిగా ధన్యవా దాలు తెలియజేశారని ఆ ప్రకటనలు పేర్కొన్నారు.



## ఆకస్మిక తనిఖీలు చేసిన జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్






**అన్నమయ్య బ్యూరో -సూర్య వాస్తవం, జూలై 22:** కురబలకోట మండలంలోని ముదివేడు మోడల్ పాఠశాలను జిల్లా సంయుక్త కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్ మంగళవారం మధ్యాహ్నం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా సంయుక్త కలెక్టర్ పాఠశాలలోని వసతులు భోజనం తయారీ మరుగుదొడ్ల నిర్వహణ తదితర అంశాలపై ఆరా తీశారు. అనంతరం పాఠ శాలలో ఏవైనా సమస్యలు ఉంటే త్వరగా వాటిని పరిష్కరించాలని పాఠశాల యాజమాన్యాన్ని ఆదేశించారు. అనంతరం మదనపల్లె మండలంలోని కొండ మఠ్రి పల్లె గ్రామపంచాయతీ ఆధ్వర్యంలోని వ్యర్థ పదార్థాల ప్రాసెసింగ్ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేసి సిబ్బందికి తగు సూచనలను చేశారు.

## కేరళా బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకున్న చంద్రబాబు చతుర్వేది



**హిందూపురం -సూర్య వాస్తవం, జులై 22:** పట్టణానికి చెందిన అభిజ్ఞా నృత్యాలయం గురువు చంద్రభాను చతుర్వేది కేరళ బుక్ ఆఫ్ రికార్డ్స్ చోటు దక్కడంతో ఆమె చదువుకున్న బాలయేసు డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపాల్స్ సౌరిరెడ్డి, జియావుల్లా ఖాన్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా సన్మానించారు. కేరళ ప్రభుత్వం తిరువనంతపురం 'రాఘవిలా సంప్యాలెస్'లో అంతర్జాతీయ శాస్త్రీయ నృత్య కళా పోటీలను నిర్వహించగా ఇందులో భారత బంగ్లాదేశ్ యూ.కె. యూయన్ దేశాలకు చెందిన 150 మంది నాట్య కళాకారులు అభిజ్ఞా నృత్యాలయం ఆధ్వర్యంలో పాల్గొ న్నారు. ఇంతమంది కళాకారులకు ప్రాతినిధ్యం వహించి వారు ఉదయం 8 గంటల నుం డి రాత్రి 11 గంటల వరకు మోహినీ అట్టం, కూచిపూడి, భరత నాట్యం, కథక్ ఒడిస్సా నృత్యాలతో అలరించారు. అందుకు కేరళ ప్రభుత్వంచే నిర్వాహకు రాలైన చంద్రబాను చతుర్వేదికి 'కేరళబుక్ ఆఫ్ 'రికార్డ్'లో చోటు దక్కింది. ఇలాంటి అరుదైన రికార్డును సొంతం చేసుకున్న తమ బాలయేసు డిగ్రీ కళాశాల విద్యార్థినికి అభినందనలు తెలిపి. సన్మానించారు.

## పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని కలిసిన కలిసిన వేణు రెడ్డి

**హిందూపురం -సూర్య వాస్తవం, జూలై 22:** వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి అనంతపురం జిల్లా రీజనల్ కో-ఆర్డినేటర్‌గా నియమితులైన పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మంగళవారం తిరుపతిలో స్థానిక వైకాపా నేత గుడ్డంపల్లి వేణురెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని, 2029లో హిందూపురం కంచుకోటను బద్దలు కొట్టి వైఎస్ఆర్ సిపి జెండా ఎగరవేయాలని సూచించినట్లు వేణురెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో తనతో పాటు చిలమత్తూరు ఎంపీపీ పురుషోత్తం రెడ్డి, రాష్ట్ర ప్రచార విభాగం ప్రధాన కార్యదర్శ సురేష్ రెడ్డి, సీనియర్ నాయకులు మొరసలపల్లి అమర్నాథ్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మణేసముద్రం దిలీప్ కుమార్ సానే రంగారెడ్డి, సుధీర్ రెడ్డి, గిరీష్ రెడ్డి, నవీన్, మీడియా కో-ఆర్డినేటర్ ప్రణయ్ రెడ్డి, కొటిపి శ్రీనివాస రెడ్డి తదితరులు ఉన్నట్లు వేణు రెడ్డి వివరించారు.



### అభివృద్ధి మరిచారు కాబట్టే

# 11 సీట్లకు ప్రజలు పరిమితం చేశారు

**- ఇచ్చిన హామీలు 80శాతం అమలు చేసాం కాబట్టే ప్రజలు టీడీపీకి బ్రహ్మరథం**
**- ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి**




**చెన్నూరు -సూర్య వాస్తవం,జూలై 22:** గత వైసిపి ప్రభుత్వం ప్రజలకు మంచి పరిపాలన అందించి ఉంటే ప్రజలు ఎందుకు 11 సీట్లకు పరిమితం చేస్తారని తమ వైఫల్యాలను కప్పిపుచ్చుకుని మంచి చేస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పై వైసిపి విష ప్రచారం చేస్తుందని ప్రజలు ఈ విష ప్రచారంపై అసహ్యించుకుంటున్నారని కమలాపురం శాసనసభ్యులు పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి అన్నారు. మండలంలోని ఉప్పరపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్ర మంలో పాల్గొన్న ఆయన, ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని వాటిని పరిష్కరించే అందుకే తమ దగ్గరికి ప్రభుత్వమే రావడం జరిగిందని ఆయన ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. గత వైసిపి పాలనలో అభివృద్ధిని మరిచారని గ్రామాలలో కనీస వసతులు కూడా పట్టించుకున్న పాపాన పోలేదని సిమెంట్ రోడ్లు, డ్రైనేజీ, వీధి దీపాలతో సహా సక్రమంగా లేక ప్రజలు ప్రజా ప్రతినిధులు, ఇటు అధికారులకు తమ గోడు వెళ్ళబోసుకొని తమ సమస్యలు చెప్పుకున్నప్పటికీ సమస్యలు పరిష్కారం కాక అనేక ఇబ్బందులు ఎదు ర్కొన్నారని ఆయన అన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సూపర్ సిక్స్ పథకాలలో సంవత్సర కాలంలోనే ఇప్పటికే 80% అమలు చేయడం జరిగిందని గ్రామాలలో అడిగిన వెంటనే సిమెంట్ రోడ్లు, డ్రైనేజీలు చేయడం జరిగిందన్నారు. ఎక్కడైనా త్రాగునీటి సమస్య ఉంటే యుద్ధప్రాధిక పదిన త్రాగునీటి సమస్యను పరిష్కరించబడుతుందని ఆయన తెలియజేశారు. టిడిపి కార్యకర్తలు తాము వస్తున్నప్పుడు టపాకాయలు పేల్చడం , పూలు చల్లడం, శాలువాలు కప్పడంకు ఉపయోగించే డబ్బులను గ్రామంలో ఉండే చిన్న చిన్న సమస్యలను పరిష్కరించేందుకు ఉపయోగించాలని ఆయన తెలిపారు. అలా చేస్తే నేను చాలా సంతోషిస్తానని ఆయన తెలిపారు. కార్యకర్తలు గ్రామంలోని ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు ఎప్పటికప్పుడు తెలుసుకొని తమ దృష్టికి తీసుకురావాలని ఆయన కార్యకర్తలకు తెలియజేశారు. ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు విజన్ ఉన్న నాయకుడని రాష్ట్ర అభివృద్ధికి ఆయన చేస్తున్న కృషి మరువ లేనిదని ఆయన తెలిపారు. ఉప్పరపల్లె కు ఎమ్మెల్యే వచ్చిన సందర్భంగా కార్యకర్తలు ప్రజలు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు కల్లూరు విజయ భాస్కర్ రెడ్డి, రామకోటిరెడ్డి, శంకర్ రెడ్డి, బుజ్జన్న, ముండ్ల శ్రీనివాసులు రెడ్డి, గుణ, రామచంద్రారెడ్డి, అనిల్ యాదవ్, పవన్ రెడ్డి, సుబ్రహ్మణ్యం, మణికంఠ, చలమారెడ్డి, మోహన్ రెడ్డి, సుధాకర్ రెడ్డి, టిడిపి నాయకులు కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## ఎమ్మెల్సీ ఆధ్వర్యంలో జాబ్ మేళా విజయవంతం

**- 30కి పైగా పరిశ్రమలు, 300 నియామకాలు**
**- ఆత్మస్థైర్యంతో పనిచేయాలి : కడ పీడీ వికాస్ మర్మత్**
**- నిరుద్యోగ నిర్మూలనే ప్రభుత్వ లక్ష్యం ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్**






**కుప్పం -సూర్య వాస్తవం, జూలై 22:**
కుప్పం పట్టణం కడ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన జాబ్ మేళా మంగళవారం విజయవంతంగా ముగిసింది. కడ కడ పీడి వికాస్ మర్మత్ ఆధ్వర్యంలో నిర్వహించినఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్, జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మంగళవారం నాడు నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమంలో 30కి పైగా పరి శ్రమలు పాల్గొనడం హర్షించదగ్గ విషయం అన్నారు. జాబ్ మేళా స్థానికంగా నిరుద్యోగ నిర్మూలనకు ఎంతగానో దోహ దపడు తోందన్నారు. మంగళవారం నాడు నిర్వహించిన జాబ్ మేళా కార్యక్రమానికి ముందు నిరు ద్యోగులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. ఇందులో భాగంగా సోమవారం నాడు నిరు ద్యోగులకు అవగాహన కార్యక్రమంతో పాటు ముందస్తు నమోదు కార్యక్రమాన్ని నిర్వహించినట్టు తెలిపారు. పదవ తరగతి, ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, పీజీ పూర్తిచేసిన పట్టభద్రులు పెద్ద ఎత్తున జాబ్ మేళాలో పాల్గొన్నారని, ఉద్యోగులుగా ఎంపికైన నిరుద్యోగులకు 14000 నుండి 60000 రూపాయల వరకు వేతనం చెల్లించడానికి పరిశ్రమల ప్రతినిధులు అంగీకరించడం జరిగిందన్నారు. అనంతరం కడ పీడి మాట్లాడుతూ ముందుగా నిరుద్యోగ నిర్మూలనకు తమ ఆధ్వర్యంలో జాబ్ మేళా కార్యక్రమాలు నిర్వ హిం చడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఉద్యోగులుగా ఎంపికైన నిరుద్యోగులు ఆత్మస్థైర్యంతో తమ విధులను నిర్వహించాలని సూచిస్తూ, భవిష్యత్తులో ఉన్నత శిఖరాలను అధిరో హించాలని ఆకాంక్షించారు. చివరగా ఎమ్మెల్సీ మాట్లా డుతూ కుప్పం నియోజకవర్గం లోని యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదేశాలలో అనుసరించి ఆయన సొంత నియోజకవర్గంలో జాబ్ మేళా నిర్వహించినట్టు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా కూటమి పార్టీల తరపున నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను ముఖ్యమంత్రి కచ్చితంగా నెరవేరుస్తారని అన్నారు. ప్రస్తుతం నిర్వ హించిన జాబ్ మేళాలో 300 మందికి పైగా ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. ఉద్యోగులుగా ఎంపికైన వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ ఉపాధ్యక్షులు పి ఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ సురేష్ బాబు, పట్టణ టిడిపి అధ్యక్షులు రాజకుమార్ తదితర నాయకులు, ప్రజా ప్రతినిధులు, కడ సలహా మండలి సభ్యులు, పలు పరిశ్రమల ప్రతినిధులు, నిరుద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మానవత్వం చాటుకున్న బిహారి అమ్మాయి

**- ఉపాధ్యాయుడిని నియమించే వరకు విద్యను బోధిస్తా అజ్మీరా ఖాన్**

**హిందూపురం -సూర్య వాస్తవం, జులై 22:** ఉమ్మడి జిల్లాలోని హిందూపురం మండలం తూమకుంట పారిశ్రామిక వాడకు ఒక ప్రత్యేక గుర్తింపు ఉంది. ఇక్కడ స్టీల్ పరిశ్రమలతో పాటు రసాయన పరిశ్రమలు విరివిగా ఉన్నాయి. ఈ పరిశ్రమల్లో ఉత్తర ప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్, జార?ండ్, మధ్యప్రదేశ్ తదితర ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వలస కార్మికులు వందలాది మంది పొట్టకూటి కోసం వలస వచ్చారు. ఈ కార్మికుల పిల్లలకు స్థానిక పాఠశాలలో విద్యాబోధన జరగడం లేదు. దీనికి ప్రధాన కారణం తూమకుంటలో ప్రాథమిక పాఠశాల ఉండడం, అందులో హిందీ ఉపాధ్యాయులు లేకపోవడంతో తెలుగు ఉపాధ్యాయులు వలస కార్మికుల పిల్లలకు చెప్పింది అర్థం కాక ఆ పిల్లలందరూ విద్యకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని ఆ పాఠశాల ఉపాధ్యాయులతో పాటు తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం నాయకులు రవికుమార్, ఇతర ప్రజా



సంఘాల నాయకులు పలుమార్లు విద్యాశాఖ అధికారులకు, స్థానిక ఎమ్మెల్యేతో పాటు జిల్లా మంత్రి సవితమ్మ దృష్టికి సైతం సమస్యలు సవివరంగా వివరించి, పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుల అవశ్యకత ఉందని, వెంటనే నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంలో మంత్రి సవితమ్మ విద్యాశాఖ రీజనల్ డైరెక్టర్ కు వెంటనే ఆ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని నియమించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. అయినప్పటికీ నిర్లక్ష్యానికి నిదర్శనం గా ఉన్న విద్యాశాఖ అధికారులు మంత్రి మాటలను నడిచెవిన పెట్టి ఇంతవరకు ఆ పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని నియమించలేదు. దీంతో బీహార్ రాష్ట్రానికి చెందిన అజ్మీరా ఖాతూన్ మంగళవారం ముందుకు వచ్చారు. పాఠశాలకు హిందీ ఉపాధ్యాయుడిని ప్రభుత్వం నియమించే వరకు పాఠాలను నేను బోధిస్తానని పేర్కొన్నారు. వెంటనే పాఠశాలకు వచ్చి విద్యార్థులకు అర్థమయ్యే విధానంలో హిందీలో విద్యా బోధన చేయడంతో విద్యార్థులందరూ సంతోషాన్ని వ్యక్తం చేశారు. మానవత్వంతో ముందుకు వచ్చిన అజ్మీరా ఖాతున్ కు తూముకుంట పారిశ్రామిక వాడ కార్మిక సంఘం అధ్యక్షులు రవికుమార్ తో పాటు ప్రజా సంఘాల వారు అభినందించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )